ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 16.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 11 డిసెంబరు 2025

నకిలీ బంగారంతో బ్యాంకర్లకు బురిడీ

- భారీగా బంగారం రుణాలు తీసుకున్న ముఠా
- మరోమారు ప్రయత్నించి దొరికిపోయిన వైనం
- పోలీసుల అదుపులో కర్ణాటక ముఠా, స్థానిక రైతులు



(వివరాలు మెయిన్‌లో..)

పుట్టపర్తి ప్రతిష్టను పెంచుదాం

- ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి ప్రతిష్టను పెంచడంలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సాయిఆరామంలో ఆటోకార్మికులు, పూలమండి వ్యాపారులతో డీఎస్పీ విజయ్‌కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆటోలు నడపాలని పేర్కొన్నారు. పుట్టపర్తి ప్రతిష్టను పెంచేవిధంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలని అన్నారు. బాబా శతజయంతి వేడుకలను విజయవంతం చేయడంలో పాలుపంచుకున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, సీఐలు శివాంజనేయులు, సురేష్, నాయకులు రామాంజనేయులు, నరసింహులు, సామకోటి ఆదినారాయణ, రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజవర్గంలోని పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

తహసీల్దార్లు కావలెను..!

- ఎక్కడి సమస్యలు అక్కడే...
- ఐదు మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన
- అనంత తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవు
- భూ సమస్యలపై ప్రజలకు తిప్పలు
- పనుల కోసం పైసలు




8

- సోమందేపల్లిలో కొన్ని నెలల క్రితం వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా విగ్రహాల తొలగింపు సందర్భంగా గంజాయి మత్తులో యువకులు గొడవకు దిగారు.
- ఇటీవల ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గంజాయి మత్తులో యువకులు పరస్పరం దాడులు చేసుకున్నారు.
- దుర్గానగర్‌లో ఇంటి వద్ద కూర్చున్న ఇద్దరిపై ముగ్గురు దాడి చేశారు. ఆ ముగ్గురూ గంజాయి మత్తులోనే దాడికి పాల్పడినట్లు తెలిసింది.

గంజాయి గ్యాంగ్‌లు..!

సోమందేపల్లిలో మత్తు బారిన యువత



- తరచూ గొడవలు, దాడులు
- బెంబేలెత్తుతున్న జనం
- అరికట్టడంలో విఫలమవుతున్న పోలీసులు

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గంజాయి గ్యాంగ్‌లు పేట్రేగిపోతున్నాయి. మత్తుకు అలవాటుపడిన యువత.. ఆ వ్యసానాన్ని తీర్చుకునేందుకు విక్రయాలకు దిగుతున్నారు. కొందరు మరో అడుగు ముందుకేసి ఇతర ప్రాంతాలకెళ్లి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. దానిని ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ఆ మత్తులో అరాచకాలు చేస్తున్నారు. గొడవలకు దిగుతున్నారు. విచక్షణారహితంగా దాడులు చేస్తున్నారు. దీంతో మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గంజాయి మత్తులో ఉన్న యువకులు.. ఎప్పుడు, ఎవరిపై దాడులు చేస్తారోనని భయాందోళనలు చెందుతున్నారు. గంజాయిని అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కట్టడి చేయలేకపోతున్న వైనం



వైసీపీ హయాంలో రాష్ట్రంలో గంజాయి ముఠాలు పుట్టుకొచ్చాయి. యువతను మత్తుకు బానిసగా మార్చేశాయి. పల్లెలు, పట్టణాల నుంచి ఉద్యోగ, ఉపాధి, చదువుల కోసం నగరాలకు వెళ్లిన యువకులు అక్కడ ఏర్పడిన స్నేహాల కారణంగా గంజాయికి అలవాటు పడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈజీ మనీకి అలవాటుపడి కొందరు యువకులు పల్లెలు, పట్టణాలకు దందా విస్తరించినట్లు తెలిసింది. వైసీపీ హయాంలో అడ్డుఅదుపులేకుండా ఈ దందాను కొందరుసాగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రం నుంచి ఇతర ప్రాంతాలకు సైతం తరలించి అక్రమార్జనకు తెరలేపినట్లు విమర్శలున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక విక్రేతలపై ఉక్కుపాదం మోపింది. అక్రమార్కుల పనిపట్టడానికి ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసింది. అయినా గంజాయి క్రయవిక్రయాలు ఆగలేదు. గతంలో వివిధ ప్రాంతాలకు చెందిన విక్రేతలు గంజాయిని నేరుగా యువతకు చేర్చేవారు. ప్రస్తుతం అలవాటుపడిన యువకులే స్వయంగా వెళ్లి తెచ్చుకుంటున్నట్లు సమాచారం. సోమందేపల్లిలో గంజాయికి బానిసైన యువత పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కియ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికుల నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి. కొందరు కేజీల్లో కొనుగోలుచేసి వాటిని యాభై, వంద గ్రాముల ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. సోమందేపల్లిలో తరచూ ఏదో ఘటన జరుగుతూనే ఉంది. చాలా వెలుగులోకి రావడంలేదు. బహిర్గతమైనా పెద్దల జోక్యంతో స్టేషన్ వరకు రావడం లేదు. మరికొన్ని ఘటనల్లో పోలీసులపై పెద్దల ఒత్తిళ్ల కారణంగా చర్యలు లేకుండా బయటపడుతున్నారు. గంజాయి వ్యవహారంలో రాజకీయ నాయకుల పిల్లలు, సమీప బంధువులు, అనుచరుల సంబంధికులు అధికంగా ఉంటుండటంతో పోలీసులు కట్టడి చేయలేకపోతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. పోలీసులకు సమాచారం ఉన్నా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్న చర్చ నడుస్తోంది. గంజాయిని పూర్తిస్థాయిలో కట్టడి చేసే దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయిని సమూలంగా నిర్మూలిస్తాం

సోమందేపల్లిలో గంజాయిని సమూలంగా నిర్మూలిస్తాం. ఇప్పటికే గంజాయి సేవిస్తున్న యువకులు, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చాం. పట్టణంలో గంజాయి బ్యాంచ్‌లను గుర్తించే పనిలో నిమగ్నమయ్యాం. గంజాయితో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు. కేసులు నమోదు చేస్తాం.

-రాఘవన్, సీఐ, పెనుకొండ

అసలా.. నకిలీనా?



తాకట్టు బంగారంపై బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల అనుమానం

- గోరంట్ల, ఓడీసీ ఘటనలతో ఉలిక్కిపడ్డ బ్యాంకర్లు
- బ్యాంకుల్లో అంతర్గత పరిశీలన.. పోలీసుల దర్యాప్తు



ఓడీసీ బ్యాంక్‌లో కుదువ పెట్టిన నకిలీ బంగారం వడ్డాణం

హిందూపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాము తాకట్టు పెట్టుకున్నది మేలిమి బంగారమేనా అనే అనుమానాలు ప్రస్తుతం బ్యాంకర్లు, గోల్డ్ ఫైనాన్స్ సంస్థల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లాలోని కొన్ని బ్యాంకుల్లో కర్ణాటకకు చెందిన ఓ ముఠా కొందరు రైతులకు కమీషన్ ఆశ చూపి వారి పేరుపై నకిలీ బంగారం కుదువపెట్టి, డబ్బులు తీసుకెళ్లారు. ఈ బాగోతం మంగళవారం గోరంట్ల, ఓడీసీలో జరిగిన ఘటనలతో వెలుగులోకి వచ్చింది. దీంతో బ్యాంకర్లు, గోల్డ్ ఫైనాన్స్ సంస్థలు తమ వద్ద ఉన్న తాకట్టు బంగారంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. కాగా నకిలీ బంగారం ముఠా పోలీసుల అదుపులో (మిగతా 8వ పేజీలో..)

వీడు మామూలోడు కాదు..!



పాత చోరీ కేసులను ఛేదించే క్రమంలో హిందూపురం పోలీసులు ఓ ఘరానా దొంగను పట్టుకున్నారు. కేవలం 39 ఏళ్ల వయసుకే ఏపీ, కర్ణాటకలోని పలు ప్రాంతాలలో ఏకంగా 55 దొంగతనం కేసులు ఉన్నాయి అతనిపై..! పేరు బండికాళ్ల రత్నరాజు అలియాస్ తేజ..! చుట్టూ పది మంది కాపలా ఉన్నా.. ఇంట్లోకి చొరబడి లూటీ చేయగల ఇలాంటి దొంగను తమ సర్వీసులో చూడలేదని పోలీసులు అంటున్నారంటే.. అతని నేర 'ఘనత' ఏ స్థాయిదో తెలుసుకోవచ్చు. 'పది మంది ముఠాతో వెళ్లినా.. ఒక్కడే ఇంట్లోకి చొరబడుతాడు. ఎత్తుకొచ్చిన సొమ్ములో కొంత బయట ఉన్నవారికి ఇస్తాడు. ఎక్కువ భాగం తానే తీసుకుంటాడు..! కష్టానికి తగ్గ ఫలితం మరి..! వీడు మామూలోడు కాదు..' అని పోలీసులు అంటున్నారు. చోరీ సొమ్ముతో గుంటూరులో రూ.2 కోట్లు వెచ్చించి రెండు ఇళ్లను నిర్మిస్తున్నాడని పోలీసులు గుర్తించారు. ఇతనితోపాటు మరో నలుగురు ఘరానా దొంగలను కూడాపోలీసులు పట్టుకున్నారు. రూ.40 లక్షల బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

(ఈ ఘరానా దొంగల వివరాలు 9లో..)

పీఎండీడీకేవైతో దీర్ఘకాలిక ప్రయోజనాలు

- కలెక్టర్ శ్యాంప్రసాద్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకం (పీఎండీడీకేవై) ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చడానికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కార్యాచరణ ప్రణాళికపై వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థకం, డీఆర్‌డీఏ, డ్వామా, ఇతర అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంశాలలో అమలవుతున్న పథకాలు, లక్ష్యాలు, సాధించిన ప్రగతి, చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో భౌగోళిక, పంట పద్ధతులు, నీటివనరులు, నేలస్వభావం వంటి క్షేత్రస్థాయి పరిస్థితులకు దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు తయారు చేయాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, పశు సంవర్థక శాఖ జేడీ శుభదాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉజ్వల గ్యాస్ కనెక్షన్: జేసీ



మాట్లాడుతున్న జేసీ మౌర్య భరద్వాజ్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన వారందరికీ ఉచితంగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్ అందించాలని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో దీపం-2 పథకం అమలుపై అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులతో జేసీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న సబ్సిడీ సక్రమంగా అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు బ్యాంకర్లతో మాట్లాడి ఈ సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. గ్యాస్ బండి కోసం అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, సీఎస్‌డీటీలు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో కలెక్టర్, జేసీ స్పీడ్

పుట్టపర్తి టౌన్, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కాగిత రహిత పరిపాలనలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ-ఫైళ్ల క్లియరెన్స్‌లో కలెక్టర్ శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ స్పీడ్ అందుకున్నారు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ ఫైళ్ల నిర్వహణ జరుగుతోంది. రాష్ట్ర మంత్రుల నుంచి సచివాలయ ఉన్నతాధికారులు, హెచ్ఓడీలు, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ఈ-ఫైళ్ల పరిష్కారంలో బాధ్యత వహించారు. ఈ-ఫైళ్ల క్లియరెన్స్ ద్వారా మంత్రుల, ఉన్నతాధికారుల పనితీరును ప్రభుత్వం బేరీజు వేస్తోంది. అందులో భాగంగా సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పారిశ్రామిక అభివృద్ధి, టూరిజం, నూతన పరిశ్రమల ఏర్పాటు, వ్యవసాయ అభివృద్ధి, సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు, నీటి ప్రాజెక్టుల తదితర అంశాలపై జూలై 7, 2024 నుంచి డిసెంబర్ 9, 2025 వరకు 595 ఈ-ఫైళ్లు స్వీకరించి 536 క్లియర్ చేశారు. జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ప్రాజెక్టుల భూసేకరణ, పౌరసరఫరాల సమస్యలు, ఫ్రీహోల్డ్ భూములు తదితర అంశాలపై జూలై 15, 2024 నుంచి డిసెంబర్ 9, 2025 వరకు 261 ఈ-ఫైళ్లు స్వీకరించి.. 144 ఫైళ్లు క్లియర్ చేశారు.

నేడు వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

- హాజరుకానున్న మధ్యప్రదేశ్ సీఎం, బీజేపీ నాయకులు
- ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్రమంత్రి సత్యకుమార్



ఆవిష్కరణకు సిద్ధం చేసిన వాజ్‌పేయి విగ్రహం

ధర్మవరం/రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు బీజేపీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి మంత్రి సత్యకుమార్‌యాదవ్ పరిశీలించారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మలు బెంగళూరు నుంచి ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో ధర్మవరం మండలం పోతుకుంట వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు.. అక్కడ నుంచి ప్రత్యేక కాన్వాయ్‌తో ధర్మవరం చేరుకుంటారు. అక్కడ కాలేజ్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి విగ్రహ ఆవిష్కరణ అనంతరం బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటుచేసిన సభలో పాల్గొంటారు. అనంతరం నియోజకవర్గంలోని 2087 మంది 10వతరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లను మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పంపిణీ చేస్తారు. అనంతరం తిరిగి హెలీక్యాప్టర్‌లో బెంగళూరుకు వెళ్తారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డిశ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పోతుకుంట నుంచి ధర్మవరంలోకి వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ జెండాలు

దారి పొడవునా జెండాలు

పోతుకుంట నుంచి ధర్మవరం వరకు దారిపొడవునా పెద్దఎత్తున బీజేపీతో పాటు టీడీపీ, జనసేన పార్టీల జెండాలు, ఫ్లెక్సీలే కనిపిస్తున్నాయి. ధర్మవరం పట్టణంలో పెద్దఎత్తున కాషాయం, టీడీపీ, జనసేన జెండాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కూటమి నేతలు పెద్దఎత్తున సమాయత్తం అయ్యారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి

ధర్మవరంలో గురువారం నిర్వహించే మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ కార్యాలయ వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో కోరాయి. ఈ కార్యక్రమానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు ఉదయం 11గంటలకు హాజరు కావాలని కోరారు.



సభాస్థలిని పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, బీజేపీ నేతలు

అటల్-మోదీ సుపరిపాలన యాత్ర

ఏర్పాట్ల పరిశీలన

పట్టణంలో గురువారం ప్రారంభం కానున్న అటల్-మోదీ సుపరిపాలన యాత్ర ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి మంత్రి సత్యకుమార్‌యాదవ్ బుధవారం పరిశీలించారు. సదస్సు ప్రాంగణం, భద్రతాఏర్పాట్లు, ప్రజల రాకపోకలకు సంబంధించిన విభాగాలు, వేదిక నిర్వహణ, పార్కింగ్, నీటి వసతి, వైద్యసేవలు తదితర అంశాలపై సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ విలువల రాజకీయాన్ని నిలబెట్టిన మహానేత అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ప్రజల మధ్య ఆవిష్కరించడం గర్వకారణమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ గురువారం ధర్మవరంలో జరగనున్న కార్యక్రమాలు ప్రజల సంక్షేమానికి , సంఘీభావానికి అద్దం పడతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, హరీశ్‌బాబు, సాకే ఓబులేసు, జింకాచంద్ర, గొట్లూరు చంద్ర, పోతుకుంట రాజు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల రక్షణలో ఆదర్శం కావాలి

- జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసవల సయ్యద్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసవల సయ్యద్

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణలో భారత్ ప్రపంచానికి ఆదర్శం కావాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముజీబ్ పసవల సయ్యద్ ఆకాంక్షించారు. బుధవారం జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పుట్టపర్తి జూనియర్ సివిల్‌కోర్టు ప్రాంగణంలో న్యాయాధికారి అధ్యక్షతన మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. పౌరుల రక్షణ కోసం భారత రాజ్యాంగంలో అనేక శక్తివంతమైన చట్టాలు ఏర్పాటు చేశారని, వాటి అమలుకు పలు వ్యవస్థలు పనిచేస్తున్నాయని వివరించారు. మానవహక్కుల పరిరక్షణ సవ్యంగా సాగాలంటే పౌరులు తమ హక్కులను వినియోగించుకోవడమే కాకుండా రాజ్యాంగం కల్పించిన బాధ్యతలను కూడా నిబద్ధతతో పాటించాలని తెలిపారు. మనస్పర్థలు, ఆవేశంతో నమోదైన కేసులను మధ్యవర్తిత్వం ద్వారా సులభంగా రాజీ చేసుకోవడానికి లోక్‌అదాలత్ ఉత్తమ వేదిక అని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు రెహమాన్, లెక్కల యధుభూషణ్, ప్రసాద్, నాగేంద్ర, కృష్ణప్రసాద్, సతీష్‌రెడ్డి, ఎల్ఐసీ లక్ష్మీరాంనాయక్ పాల్గొన్నారు.

భగీరథ ప్రయత్నం..!

- అమరాపురం చెరువుకు త్వరలో నీరు
- ట్రయల్ రన్ పూర్తి
- నెరవేరనున్న రైతుల కల

8



హంద్రీనీవా కాలువ ద్వారా మడకశిర చెరువుకు చేరుతున్న కృష్ణాజలాలు

ఏళ్లుగా ఎదురుచూపు
- వితంతువులకు అందని పింఛన్
- కుటుంబ పోషణకు పలువురి ఇబ్బంది

9 **నేడే సీపీఐ వందేళ్ల వేడుకలు**
- ఉద్యమ కుటుంబాలకు సత్కారం
- కేంద్ర, రాష్ట్ర నేతలు రాక

రాజ్యాంగంతోనే స్థిరత్వం

మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్



మాట్లాడుతున్న చంద్రశేఖర్

అనంతపురం ప్రెస్ క్లబ్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతమైన రాజ్యాంగంతోనే దేశంలో స్థిరత్వం ఉంటుందని మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఎస్కేయూలోని న్యాయశాస్త్ర విభాగంలో జనవిజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని అర్థం చేసుకుందాం - కాపాడుకుందాం అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఆ కమిటీ జిల్లా ప్రధానకార్యదర్శి వీరరాజు అధ్యక్షతన జరిగిన సదస్సుకు చంద్రశేఖర్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం రూపొందించుకోవడానికి ముందు ఒక సుదీర్ఘమైన స్వాతంత్ర్య పోరాటం జరిగిందన్నారు. రాజ్యాంగం అంటే ప్రజలని, రాజ్యాంగం గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ దేశం లో నివసిస్తున్న ప్రజలందరికీ భావ ప్రకటన స్వేచ్ఛ రాజ్యాంగం ద్వారానే వచ్చిందన్నారు. రాజ్యాంగం పట్ల అవగాహన ఉన్నప్పుడే దేన్నైనా ప్రశ్నించగలుగుతామన్నారు. అందుకే ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని అధ్యయనం చేయడమే కాక అర్థం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఈ నెల 14న ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సదస్సులో న్యాయశాస్త్ర విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీరాములు, అధ్యాపకులు హుస్సేని, జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్‌రెడ్డి, తిరుపాల్, కోశాధికారి రామిరెడ్డి, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు



గుంతకల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రైల్వే డివిజన్ మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-యల్హంక ప్రత్యేక రైలు (07159) ఈ నెల 24, 29 తేదీల్లో చర్లపల్లిలో రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 11-45 గంటలకు యల్హంకకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (07160) ఈ నెల 25, 30 తేదీల్లో మధ్యాహ్నం 1 గంటలకు యల్హంకలో బయలుదేరి మరుసటిరోజు తెల్లవారుజాము నాలుగున్నరకు చర్లపల్లికి చేరుతుందన్నారు. ఈ రైలు కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, అనంతపురం, ధర్మవరం, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, హిందూపురం స్టేషన్ల మీదుగా యల్హంకకు చేరుకుంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శింగనమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం పెద్దమ్మ అమ్మవారి ఆలయ నూతన ధర్మకర్తల మండలి కమిటీ ఏర్పాటు కోసం భక్తులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.రంగస్వామి నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దేవాదాయ కమిషనర్ నోటిఫికేషన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ధర్మకర్తల మండలి కమిటీలో 9 మంది సభ్యుల్లో ఐదుగురు మహిళలు ఉండేలా ఎంపిక ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30 తేదీ లోపు అనంతపురం జిల్లా దేవాదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- వైసీపీ కూల్చివేతపై రెండేళ్ల తర్వాత చర్యలు
- కేసు నమోదైన ఆరు నెలలకు బోర్డు ఏర్పాటు



పశువుల ఆస్పత్రి స్థలంలో బోర్డు నాటిన అధికారులు

బొమ్మనహాళ్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి) వైసీపీ హయాంలో జరిగిన అక్రమ వ్యవహారాలపై కేసులు నమోదవుతున్నాయి. అధికారం అండతో ప్రభుత్వ భవనాన్ని కూల్చి, ఆ స్థలంపై హక్కులు పొంది, మరొకరి పేరుపై కణేకల్లు రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ప్రభుత్వం మారిన తర్వాత ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. మండలంలోని గోవిందవాడ గ్రామంలో పశువైద్యశాల భవనం నిర్మాణం కోసం 2000లో బళ్లారి సిద్ధమ్మ గ్రామంలోని 170సి సర్వే నంబర్‌లో 3 సెంట్లు స్థలం ప్రభుత్వానికి ఇచ్చింది. 2001లో అప్పటి ఎంపీ కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం ఎమ్మెల్యే పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి పశువైద్యశాల భవనం ప్రారంభించారు. అయితే భవనం శిథిలావస్థకు చేరిందని వైసీపీ పాలనలో 2023లో కూల్చివేశారు. ఆ స్థలాన్ని మరొకరికి రిజిస్ట్రేషన్ చేయించి కొందరు వైసీపీ నాయకులు సొమ్ము చేసుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొందరు గ్రామస్థులు విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఆదేశాలు రావడంతో పశువైద్యాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భవనాన్ని కూల్చిన రెండేళ్ల తర్వాత గ్రామానికి చెందిన శరణబసవ, చిదానందలపై కేసు నమోదు అయ్యింది. తర్వాత ఆరు నెలలకు అక్కడ బోర్డు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మునివేలు, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, ట్రైనీ ఎస్ఐ నవీన్ బుధవారం బోర్డు ఏర్పాటు చేయించారు. స్థలం స్వాధీనం చేసుకోనేందుకు ఇన్ని రోజులు సమయం పట్టిందా అని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ స్థలంపై హక్కులు కల్పించిన రెవెన్యూ అధికారులపై చర్యలు ఏవి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



పశువుల ఆస్పత్రిని కూల్చేసిన దృశ్యం (ఫైల్)

దుర్గం అభివృద్ధికి రూ.23 కోట్లు

- విప్ కాలవకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి హామీ



మంత్రి నారాయణతో విప్ కాలవ

రాయదుర్గం రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధి, మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ.23 కోట్ల మంజూరు చేస్తానని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే, విప్ కాలవ శ్రీనివాసులు ఒక ప్రటనలో తెలిపారు. అమరావతిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మంత్రితో భేటీ అయినట్లు విప్ తెలిపారు. పట్టణా భివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేయాలని 2024 నవంబరు 30న నేమకల్లులో నిర్వహించిన ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో దశలవారీగా ఈ నిధులు మంజూరు చేయడానికి సీఎం నాడు అంగీకరించారని తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణను బుధవారం కలవగా.. సీఎం హామీలో భాగంగా రూ.23 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు విప్ వివరించారు.

అసలా.. నకిలీనా?



స్టేట్ బ్యాంకు గోరంట్ల శాఖ కార్యాలయం

(7 పేజీ తరువాయి)

ఉంది. వీరి నుంచి జరిగిన మోసాలపై ఆరాతీస్తున్నారు.

రూ.రెండు కోట్ల దాకా..

కర్ణాటక రాష్ట్రం యల్హంకకు చెందిన ఓ ముఠా గత కొంత కాలంగా నకిలీ బంగారం తీసుకొచ్చి జిల్లాలోని పలుచోట్ల బ్యాంకుల్లో కుదువపెట్టి డబ్బును తీసుకెళ్తోంది. వీరు పది తులాల నకిలీ బంగారం తీసుకొస్తే అందులో రెండు తులాల మేలిమి బంగారం ఉంటుంది. వారు తయారుచేసిన వస్తువులకు బంగారుపూత పూసి లోపల ఖైనం లేదా ఇతర లోహాలు కలిపి ఉంచుతారు. బ్యాంకు లేదా గోల్డ్ ఫైనాన్స్‌లలో బంగారమా కాదా అనిచూసేది పైన మాత్రమే. అయితే ఎక్కడా అనుమానం రాకుండా వస్తువులు నాలుగు వైపులా బంగారు పూత ఉంటుంది. దీంతో ఎవరూ అనుమానించేందుకు వీలుండదు. దీంతో ఈ ముఠా ఇప్పటి వరకు జిల్లాలో రూ.2కోట్ల దాకా నకిలీ బంగారం తాకట్టుపెట్టి నగదు తీసుకున్నట్లు సమాచారం.

కమీషన్ మాట్లాడుకుని...

కర్ణాటకకు చెందిన వ్యక్తులు జిల్లాలోని కొంతమందితో పరిచయం పెంచుకుంటారు. తర్వాత అత్యవసరం ఉందని, మీ పేరుపై తమ బంగారాన్ని బ్యాంకులో కుదువ పెడతామని అడుగుతారు. ఇందుకు కమీషన్ కూడా ఇస్తామని చెబుతారు. దీంతో కమీషన్‌కు ఆశపడిన కొందరు తమ పేరుపై ఆ నకిలీ బంగారాన్ని కుదువపెట్టి నగదు దుండగుల చేతికి ఇస్తారు. ఉదాహరణకు రూ.10లక్షలు విలువ చేసే సొమ్ము పెడితే పెట్టిన వ్యక్తికి రూ.20వేల నుంచి రూ.30వేలు ఇస్తారు. లేదా ఆ ప్రాంతంలోని వ్యక్తులు డబ్బులు అవసరమని చెబితే మీపేరుమీదే బంగారం కుదువపెట్టి ఇస్తామని రూ.లక్ష అవసరం ఉంటే రూ.10లక్షలు సొమ్ము పెట్టి అతనికి రూ.లక్ష ఇచ్చి మిగిలిన రూ.9లక్షలు ముఠా సభ్యులు ఎత్తుకెళ్తారు.

పోలీసుల అదుపులో ముఠా

ఇదిలా ఉంటే మంగళవారం నలుగురు ముఠా సభ్యులు నకిలీ బంగారాన్ని తీసుకుని ఖరీదైన కారులో వచ్చారు. అందులో ఇద్దరు గోరంట్లలోని ఓ బ్యాంకులో తాకట్టుపెట్టడానికి వెళ్లారు. మరో ఇద్దరు ఓడీసీలో ఓ బ్యాంకులో తాకట్టుపెట్టడానికి వెళ్లారు. అయితే గోరంట్లలో బ్యాంక్ అధికారులకు అనుమానం వచ్చి తాకట్టుపెట్టడానికి వచ్చిన వారిని బ్యాంక్‌లో పెట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి ఆరాతీయగా అసలు విషయం వెలుగు చూసింది. 16తులాల బంగారం బ్యాంక్ సిబ్బందికి చూపించారు. అయితే అది నకిలీదని గుర్తించి బ్యాంక్ అధికారులు అప్రమత్తం అయ్యారు. గతంలోకూడా ఈ ముఠాసభ్యులు ఓడీసీలోని బ్యాంక్‌లో ఓ రైతు పేరుమీద వడ్డాణం కుదువ పెట్టారు. దీనిద్వారా రూ.30లక్షలు రుణం పొందారు. మంగళవారం కూడా ఇదేతరహాలో మరో 20తులాలు అక్కడికే తీసుకెళ్లారు. అయితే గోరంట్లలో సంఘటన జరిగిన వెంటనే ఓడీసీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడ అప్రమత్తం కావడంతో వారిని కూడా ఓడీసీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



కర్ణాటక ముఠా వినియోగించిన కారు



ఓడీసీ బ్యాంక్‌లో కుదువ పెట్టిన నకిలీ బంగారం

అంతర్గత శోధన

జిల్లాలో రెండు మండల కేంద్రాల్లో ఒకేరోజు రెండు ఘటనలు జరగడం అదికూడా ఒకే ముఠాకు చెందిన సభ్యులు కావడంతో గతంలో కూడా వీరు ఓడీసీలో రూ.30లక్షలు రుణం పొందడంపై బ్యాంక్ అధికారులు, గోల్డ్ ఫైనాన్స్‌లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఈ ముఠా సభ్యులు ఎక్కడెక్కడ నకిలీ బంగారం కుదువపెట్టారు? ఎవరిపేరుపై పెట్టారు? ఎంత మేర పెట్టారు? అన్న వివరాలను ఆరా తీసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే బ్యాంక్ అధికారులకు ఈ ఘటనతో భయం చుట్టుకుంది. ఎక్కడెక్కడ నకిలీ బంగారం కుదువపెట్టారని బ్యాంక్ ఉన్నతాధికారులు కూడా ఆరాతీస్తున్నారు. గోరంట్ల, ఓడీసీ పోలీసుల అదుపులో నలుగురు ముఠా సభ్యులు ఉన్నారు. వీరిద్వారా మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ ముఠాకు లీడర్‌గా కర్ణాటకకు చెందిన వ్యక్తి ఉన్నాడని, ఆంధ్రతోపాటు కర్ణాటకలోని బ్యాంకుల్లో కూడా ఇదే తరహా మోసం చేసినట్లు సమాచారం.

తహసీల్దార్లు కావలెను..!

- ఎక్కడి సమస్యలు అక్కడే...
- జిల్లాలో ఐదు మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన
- అనంత తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవు
- భూసమస్యలపై ప్రజలకు తిప్పలు
- పనుల కోసం పైసలు



విడపనకల్లు తహసీల్దార్ కార్యాలయం

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తహసీల్దార్ల పోస్టులకు డిమాండ్ ఏర్పడింది. ఏకంగా ఐదు మండలాలకు తహసీల్దార్లు లేరు. దాదాపు ఏడాదికి పైగా ఇదే పరిస్థితి. సంబంధిత మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతోంది. ఆ మండలాల్లో రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయి. ఇన్‌చార్జ్‌లు చిన్న చిన్న సమస్యలు, ధ్రువీకరణ పత్రాలపై సంతకాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నా యి. భూసమస్యలు పరిష్కారం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే తరుణంలో దళారులు తహసీల్దార్ కార్యాలయంలో మీ పనులు చేయిస్తామంటూ పైసలు వసూలు చేస్తున్నారు.

ఇన్‌చార్జ్‌లే దిక్కు

జిల్లాలోని ఐదు మండలాల్లో తహసీల్దార్లు లేరు. దీంతో అక్కడ సమస్యలు పేరుకుపోయాయి. విడపనకల్లు తహసీల్దార్ లేకపోవడంతో ఇన్‌చార్జ్‌గా గుంతకల్లు తహసీల్దార్ రమాదేవికి అప్పగించారు. పుట్లూరు మండల ఇన్‌చార్జ్‌గా శింగనమల తహసీల్దార్ శేషారెడ్డికి, కూడేరు మండల ఇన్‌చార్జ్‌గా ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్‌బాషాకు బాధ్యతలు అప్పగించారు. యల్లనూరు, వజ్రకరూరు మండలాల్లో స్థానికంగా పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లకే ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. కూడేరు మండలానికి ఇన్‌చార్జ్ తహసీల్దార్ వారంలో మూడు రోజులు వస్తుంటారు. ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో వచ్చి వెళ్తుంటారని సమాచారం. కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు, ఇతర చిన్న సమస్యలే పరిష్కారమవుతున్నాయని తెలుస్తోంది. విడపనకల్లు మండలానికి తహసీల్దార్ వారంలో ఒక్కరోజే వస్తారని, రెండు, మూడు గంటలే ఉంటున్నారని మండల ప్రజలు అంటున్నారు. పుట్లూ రు మండల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఇన్‌చార్జ్ తహసీల్దార్ అక్కడి కెళ్లడానికి 10 రోజులు పడుతోందని తెలుస్తోంది. యల్లనూరు, వజ్రకరూరు మండలాల్లో స్థానిక డిప్యూటీ తహసీల్దార్లే ఇన్‌చార్జ్‌లుగా ఉన్నప్పటికీ కీలక సమస్యలను పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతపురం అర్బన్ తహసీల్దార్‌గా ఉన్న హరికుమార్ నెలన్నర రోజులుగా సెలవులో ఉన్నారు. అధికారపార్టీ నేతల ఆశీర్వాదంతో ఆ సీటులోకి వచ్చిన ఆయన.. ఒత్తిళ్ల నేపథ్యంలోనే సెలవులో వెళ్లినట్లు సమాచారం. ఇక్కడా ఇన్‌చార్జ్‌గా రూరల్ తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆయనేమో ఆ బాధ్యతలు తనకొద్దు బాబోయ్ అంటున్నారని సమాచారం. పలు సమస్యలు పేరుకుపోయాయి.

ప్రజలకు అవస్థలు

విపడనకల్లు మండలానికి చెందిన ఉమాదేవి అనే మహిళ ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం రెండునెలల క్రితం దరఖాస్తు చేసుకుంది. ఇది ఇవ్వాలల్సిన గడువు ముగిసినా ఇవ్వలేదు. మరోసారి దరఖాస్తు చేసుకున్నా అదే పరిస్థితి. అధికారులు పట్టించుకోకపోవడంతో చివరికి మూడో దరఖాస్తు చేసుకుంది. తహసీల్దార్ లేకపోవడంతో విడపనకల్లులో ఎలాంటి పరిస్థితి నెలకొందో ఈ ఉదాహరణ చెబుతుంది. మ్యుటేషన్, రీ సర్వే వంటి సమస్యల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పుట్లూరులో ఆన్‌లైన్ ఎక్కించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. వజ్రకరూరులో పర్యటించిన కలెక్టర్ వీఆర్‌ఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చుక్కల భూములు, 22ఏ ఫైల్స్ విషయంలో పైకి పంపడంలో ఆయా మండలాల్లో నిర్లక్ష్యం కనిపిస్తోంది.

పైసలిస్తేనే పనులు..

రెగ్యులర్ తహసీల్దార్లు లేని ఆ కార్యాలయాల్లో పనులు కావాలంటే పైసలు కావాలంటున్నారు. సంబంధిత కార్యాలయాల్లో కింది స్థాయి నుంచి పై వరకు ఎవరి స్థాయిలో వారు ముడుపుల వ్యవహారం నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. వీఆర్‌ఓలు, సర్వేయర్లు, కొందరు రెవెన్యూ సిబ్బంది పనులు కావాలంటే ఆమ్యామ్యాలు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూములు, పేరు మార్పిడి, మ్యుటేషన్, వివాదం ఉన్న భూములలో సర్వే చేయడానికి డబ్బుల వ్యవహారం బాగానే నడుస్తున్నట్లు తెలుస్తోంది. కూడేరు మండలంలో ఓ వీఆర్వో పై అధికారులతో కలిసి పని త్వరగా చేయిస్తానంటూ ముడుపులు పుచ్చుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు ఇవ్వందే విలేజ్ సర్వేయర్లు సర్వే చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. కొందరు మధ్యవర్తులు దళారుల అవతారం ఎత్తి వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం.

మాజీ సైనికులకు అండ

- పిల్లల విద్యకు ప్రత్యేక గ్రాంట్‌లు
- కుటుంబ సంక్షేమానికి పలు పథకాలు
- రాజ్యసైనిక్ బోర్డు ద్వారా చేయూత



జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైన్యంలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యుల కోసం రాజ్యసైనిక్ బోర్డు పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. మాజీ సైనికుల పిల్లల విద్యాభివృద్ధి, కుటుంబ సభ్యుల ఆర్థిక పరిపుష్టికి ప్రత్యేక గ్రాంట్‌లను తీసుకొచ్చింది. విద్యార్థులకు ఇంటర్ నుంచి ఉన్నత విద్య వరకూ స్కాలర్ షిప్‌లు, కుమార్తెల వివాహాలకు గ్రాంట్‌లను అందిస్తోంది. వితంతు మాజీ సైనికుల పునర్వివాహం, అంగవైకల్యం, మాజీ సైనికుల దహన సంస్కారాల తదితర వాటి కోసం ఆర్థిక సాయాలను ఇస్తోంది. ఈ పథకాలను వినియోగించుకోవడంలో కొంత మంది ఇంకా వెనుకబడి ఉన్నారు. ఈ నేపథ్యంలో సైనిక సంక్షేమశాఖ పరిధిలో అమలవుతున్న పథకాలపై ప్రత్యేక కథనం.

మాజీ సైనికుల పిల్లలకు వర్తించే పథకాలు

ఇంటర్ చదివే విద్యార్థులకు ఎడ్యుకేషనల్ గ్రాంట్ కింద సంవత్సరానికి రూ. 8 వేలు ఇస్తారు. వృత్తిపరమైన కోర్సులు మినహా డిగ్రీ ఎడ్యుకేషనల్ గ్రాంట్ కింద సంవత్సర కాలానికి రూ. 8 వేలు, పీజీ కోర్సులు అభ్యసించే వారికి రూ. 8 వేలు, బీటెక్, ఎంబీబీఎస్, ఎంబీఏ తదితర కోర్సులు చదివే విద్యార్థులకు సంవత్సరానికి రూ. 10 వేలు చెల్లిస్తారు. ఉన్నత చదువుల నిమిత్తం హాస్టళ్లలో ఉన్న విద్యార్థులకు హాస్టల్ గ్రాంట్ కింద సంవత్సరానికి రూ. 10 వేలు, కుమార్తెల వివాహాలకు వివాహ గ్రాంట్ కింద ఒక్కో కుమార్తెకు రూ. 25 వేలు అందజేస్తారు. ఇద్దరు కుమార్తెలకు మాత్రమే ఈ గ్రాంట్ వర్తిస్తుంది. కులాంతర వివాహం చేసుకునే కుమార్తెలకు వివాహ గ్రాంట్ కింద రూ. 25 వేలు, మాజీ సైనికుడి వితంతువు పునర్వివాహం గ్రాంట్ కింద రూ. 25 వేలు, మాజీ సైనికుడు మరణిస్తే దహన సంస్కారాల ఖర్చులకు రూ. 10 వేలు, మాజీ సైనికుడి భార్య మరణిస్తే... దహన సంస్కారాలకు రూ.7వేలు, పిల్లలకు దహన సంస్కారాలకు రూ.5వేల చొప్పున గ్రాంట్ ఇస్తారు.

నూతన పథకాలు

మాజీ సైనికుల కుటుంబాల ఆర్థిక, సామాజిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కొన్ని నూతన పథకాలను ప్రవేశపెట్టారు. సైనిక్ స్కూల్‌లో ప్రవేశం పొందిన పిల్లలకు రూ. 15 వేలు, నేషనల్ డిఫెన్స్ అకాడమీలో ప్రవేశం పొందిన పిల్లలకు రూ. 30 వేలు, పీహెచ్‌డీ చేసిన వారికి రూ. 30 వేలు, సీఏ చేసిన వారికి రూ. 30 వేలు, విదేశాలలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న వారికి రూ. 50 వేల చొప్పున ఏటా స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నారు. అనాథ పిల్లలకు ప్రత్యేక విద్యా గ్రాంట్ కింద రూ. 30 వేలు, సర్వీసులో మరణించిన సైనికుల కుటుంబాలకు ఆర్థికసాయం కింద రూ. లక్ష, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడలు, సంగీతం, నృత్యం తదితర వాటిలో నైపుణ్యం ప్రదర్శించిన మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులకు నగదు పురస్కారం కింద రూ. 10 వేలు చెల్లిస్తారు. ప్రమాదాలలో (అగ్ని, తుఫాన్) నష్టపోయిన మాజీ సైనికులకు ఆర్థికసాయం కింద రూ. 20 వేలు ఇస్తారు. వృత్తివిద్యా కోర్సులు చేస్తున్న మాజీ సైనికులకు, వితంతు మాజీ సైనికులకు రూ. 20 వేలు ఆర్థిక సాయం చేస్తారు.

అర్హతలు

గతంలో ప్రత్యేక నిధి నుంచి మంజూరు చేసే గ్రాంట్‌లు హవల్దార్ ర్యాంకు వరకూ పనిచేసిన మాజీ సైనికులకు మాత్రమే వర్తించేవి. ఆ నిబంధనను సడలిస్తూ అన్ని గ్రాంట్‌లు జూనియర్ కమిషన్ ర్యాంకు(జేసీఓ) వరకూ పనిచేసిన మాజీ సైనికులకు అమలు కానున్నాయి. ఈ పథకాలకు దరఖాస్తు చేసుకునే మాజీ సైనికుల పిల్లలు.. వారి తల్లిదండ్రుల ఐడీ కార్డు, డిశ్చార్జ్ బుక్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాపీ, విద్యార్థుల స్టడీ సర్టిఫికెట్, క్యాప్ సర్టిఫికెట్, తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలతో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులను జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలి. రాష్ట్ర అధికారుల ఆమోదంతో బ్యాంకు ఖాతాలకు గ్రాంట్ సొమ్ము జమ అవుతుంది.

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని మాజీ సైనికులకు రాజ్య సైనిక్ బోర్డు కింద అమలయ్యే పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. మాజీ సైనికుల పిల్లల విద్యకు సంబంధించిన పథకాలు అందుబాటులో ఉన్నాయి. స్కాలర్‌షిప్‌లతో పాటు కుమార్తెల వివాహం, దహన సంస్కారాలు, అంగవైకల్యం, వితంతు వివాహం, చిరు వ్యాపారాల కోసం అందించే ఆర్థిక సాయాలను స్కీమ్‌లో ఉన్నాయి. అర్హులైన ప్రతిఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు.

- తిమ్మప్ప, జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి

భగీరథ ప్రయత్నం..!

సముద్ర మట్టానికి 2 వేల మీటర్ల ఎత్తు.. చిట్ట చివరన, కొండకోనల్లో ఉంది అమరాపురం. ఆ ఊరి చెరువుకు నీరు పారించడం, అది కూడా.. వందల కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణాజలాలు తీసుకెళ్లడం సాధ్యమేనా? అసాధ్యమనే అనుకుంటారు. అలాంటి దానిని సుసాధ్యం చేస్తున్నారు. ఎట్టకేలకు అమరాపురం చెరువుకు త్వరలో కృష్ణాజలాలు చేరనున్నాయి. ఇందుకు సంబంధించి ట్రయల్ రన్ కూడా పూర్తయింది. అమరాపురం చెరువుకు కృష్ణా జలాలు తీసుకెళ్లడమంటే భగీరథ ప్రయత్నమేననడంలో అతిశయోక్తి లేదు.

- అమరాపురం చెరువుకు త్వరలో నీరు
- ట్రయల్ రన్ పూర్తి
- నెరవేరనున్న రైతుల కల



అమరాపురం చెరువుకు నీరిచ్చేందుకు ట్రయల్ రన్

మడకశిర, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): కరువుతో తడారిపోయిన అమరాపురానికి కృష్ణాజలాలు రానున్నాయి. హంద్రీనీవా కాలువల ద్వారా నీటిని విడుదల చేయడానికి రెండ్రోజుల క్రితం ట్రయల్ రన్ నిర్వహించారు. కదిరేపల్లి వద్ద 17 పంపులను ఆన్ చేసి, నీటిని వదలడంతో అమరాపురం మండలంలోని ఆహ్లాదపల్లి వరకు కాలువ గుండా వెళ్లాయి. త్వరలోనే అమరాపురం ప్రాంతంలోని చెరువులకు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారుల సమాచారం. మడకశిర చెరువుకు ప్రస్తుతం నీరు చేరుతోంది. గొల్లపల్లి రిజర్వాయర్‌లో 1.72 టీఎంసీల నీరు నిలువ ఉంది. సెప్టెంబరు 26 నుంచి ఇప్పటి వరకు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర ప్రాంతానికి కృష్ణానది జలాలు వస్తున్నాయి. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి అమరాపురం చెరువుకు 193 కిలోమీటర్ల దూరం ఉంది. అంత దూరం నీరు చేరనుంది. మడకశిర చెరువు అనంతరం హేల్కూరు చెరువుకు నీరు విడుదల చేయనున్నట్లు అధికారుల సమాచారం.

2.2 అడుగుల ఎత్తులో మడకశిర

కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గం సముద్ర మట్టానికి 2.2 వేల అడుగుల ఎత్తులో ఉంది. దీంతో ఈ ప్రాంతంలో కురిసిన వర్షపు నీరంతా దిగువ ప్రాంతంలోని కర్ణాటక చెరువులకు చేరుతుంది. దీంతో ఈ ప్రాంతంలో తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. సాగునీటి వనరులు కూడా లేవు. భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగు, సాగునీటికి ఇబ్బందులు పడాల్సి వచ్చేది. కష్ణా జలాలతో ఈ ప్రాంత చెరువులు నింపాలని నిర్ణయించారు. కూటమి అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతం అయ్యాయి. కాలువలో బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. గత ప్రభుత్వంలో బ్రిడ్జిల నిర్మాణానికి అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపినా.. నిధులు మంజూరు కాలేదు. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ అంచనాలు వేసి, సంబంధిత శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఇప్పటి వరకు మడకశిర చెరువుకు కృష్ణాజలాలు చేరాయి. చిట్ట చివరన ఉన్న అమరాపురం వైపు నీరు చేరలేదు. త్వరలో కృష్ణాజలాలను అమరాపురం వైపు విడుదల చేయనున్నట్లు అధికారులు అంటున్నారు. బ్రిడ్జిల నిర్మాణం చేపడితే కృష్ణాజలాలు చేరుతాయని ఈ ప్రాంత ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మత్తులు చేసి నీటిని వదులుతున్నారు.

హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మడకశిర ప్రాంతానికి వచ్చినపుడు ఈ ప్రాంతంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని కృష్ణా జలాలతో చెరువులను నింపి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విన్నవించారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఈ ప్రాంతంలోని చెరువులకు హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణాజలాలు నింపి తాగు, సాగునీటి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా మడకశిర ప్రాంతంలోని చెరువులకు కృష్ణాజలాలు హంద్రీనీవా కాలువల ద్వారా చెరువులకు చేరుతున్నాయి. ఇప్పటికే మడకశిర మండలం మణూరు, హరేసముద్రం చెరువులు నిండాయి. హరేసముద్రం నుంచి మడకశిర వైపు నీటిని విడుదల చేశారు. అమరాపురం ప్రాంతంలోని చెరువులకు నీటిని విడుదల చేయడానికి ట్రయల్ రన్ నిర్వహించారు.

ఏళ్ల కల నెరవేరుతోంది



ఏళ్ల కల త్వరలో నెరవేరుతుండడంతో చాలా సంతోషంగా ఉంది. కృష్ణా జలాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. అమరాపురం మండలంలో 5వేల ఎకరాల్లో వక్కతోటలు సాగులో ఉన్నాయి. కృష్ణాజలాలతో చెరువులను నింపడానికి ట్రయల్ రన్ నిర్వహించడంతో అమరాపురం మండంలో కూడా హంద్రీనీవా కాలువల ద్వారా నీరు పారాయి. త్వరలో అమరాపురం చెరువుకు నీరు చేరుతుండడంతో సంతోషంగా ఉంది.

- రైతు శ్రీనివాస్, హేల్కూరు, అమరాపురం

ట్రయల్ రన్ నిర్వహించాం

అమరాపురం మండలంలోని చెరువులకు నీరివ్వడానికి కదిరేపల్లి వద్ద పంపులను ఆన్ చేసి, నీటిని విడుదల చేసి ట్రయల్ రన్ నిర్వహించాం. అమరాపురం మండంలోని ఆహ్లాదహళ్లి వరకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరు పారాయి. ఇప్పటికే మడకశిర మండలంలోని మణూరు చెరువు నిండింది. త్వరలోనే అమరాపురం చెరువుకు నీరు విడుదల చేస్తాం.

- నాగార్జున, హెచ్ఎన్ఎస్ఎస్ ఏఈ

రైతులను మోసగించిన వ్యాపారి అరెస్టు



అరెస్టు చూపుతున్న ఎస్ఐ శివ

బెళుగుప్ప, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతుల నుంచి పప్పుశనగ, ధనియాల పంటలను కొనుగోలు చేసి డబ్బులివ్వకుండా మోసగించిన వ్యాపారి విక్రమ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. బుధవారం ఆయన విలేకరరులతో మాట్లాడుతూ.. బెళుగుప్పకు చెందిన వ్యాపారి విక్రమ్ రైతుల నుంచి రూ.2.65 కోట్లు విలువ జేసే ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మూడేళ్లుగా పరారీలో ఉన్నాడని తెలిపారు. మోసపోయిన బాధిత రైతులు ఈ యేడాది మార్చి 20న ఎస్పీకి ఫిర్యాదు చేశారని వివరించారు. మండలంలోని గుండ్లపల్లి వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాలిక గర్భం దాల్చడానికి కారకుడైన బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా బుధవారం తెలిపారు. తాడిపత్రి పట్టణంలోని బాలికకు మాయమాటలు చెప్పి బాలుడు మోసగించినట్లు వివరించారు. వారం రోజుల క్రితం బాలిక వారి బంధువుల ఊరిలో ప్రసవించింది. విషయం ఐసీడీఎస్ అధికారులకు తెలియడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ గౌస్‌బాషా ఇద్దరిని విచారించారు. ఇద్దరూ మైనర్లు కావడంతో గర్భం దాల్చడానికి కారకుడైన బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నరసింహా రెడ్డి (ఫైల్)

తాడిమర్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పూల ఓబయ్యపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నరసింహారెడ్డి(58) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయనకు మూడున్నర ఎకరాల పొలం ఉంది. రూ. 10 లక్షలకు పైగా అప్పులు ఉన్నట్లు తెలిపారు. అప్పులిచ్చిన వారి నుంచి ఇటీవల వేధింపులు ఎక్కువయ్యాయని సన్నిహితుల వద్ద చెప్పుకునేవాడు. బుధవారం ఉదయం భార్య కాంతమ్మ వ్యవసాయ పనుల కోసం బయటకు వెళ్లింది. ఇంటిలో ఎవరూ లేని సమయంలో నరసింహారెడ్డి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు నరసింహారెడ్డి ఇంటికి వెళ్లి పరిశీలించగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రిష్ణవేణి తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి వివాహాలు జరిగాయి.

క్యాన్సర్ బాధిత చిన్నారికి లోకేశ్ అండ

ఎమ్మెల్యే దగ్గుపాటి ఎల్ఓసీ ద్వారా రూ.12 లక్షల సాయం


ఎమ్మెల్యేకి వినతిపత్రం అందిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

అనంతపురం క్రైం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ చొరవ తీసుకుని బాలుడి సమస్యను లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా రూ.12 లక్షల సాయం అందించారు. నగరంలోని వేణుగోపాల్ నగర్‌కు చెందిన 12 ఏళ్ల బాలుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. బెంగళూరులోని శంకర క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా బాలుడికి చికిత్స అందిస్తున్నారు. ఆర్థికంగా అంతంత మాత్రంగా నెట్టుకొస్తున్న తల్లిదండ్రులకు మరింత భారంగా మారింది. వారు స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటిని ఆశ్రయించారు. గత నెలలో జిల్లా పర్యటనకు వచ్చిన లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలుడి వైద్య చికిత్సలకు సాయం అందించాలని కోరారు. స్పందించిన మంత్రి సీఎంఆర్ఎఫ్ పరిధిలో చికిత్సలకు ముందే ఎల్ఓసీ ద్వారా రూ.12 లక్షల సాయం అందించారు. దీంతో తల్లిదండ్రులు ఎమ్మెల్యేకి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాశాఖలో ఇద్దరికి ఉద్యోగోన్నతి

అనంతపురం విద్య, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో ఇద్దరు రికార్డు అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి కల్పించారు. షేక్షావలి, సత్యనారాయణకు జూనియర్ అసిసెంట్లుగా ప్రమోషన్ ఇస్తూ.. ఒకరికి బుక్కపట్నం డైట్, మరొకరిని తాడిపత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నియమించారు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు బుధవారం ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఏడీలు మునీర్‌ఖాన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోండి

సూపరింటెండెంట్ అమర్‌నాథ్

అనంతపురం అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు తపాల శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తపాల ఎస్పీ కార్యాలయంలో పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ... పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలపై తపాల అధికారులు, సిబ్బంది ప్రజలకు మరింతగా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం విధించిన లక్ష్యం మేరకు అధికారులు, సిబ్బంది పనిచేసేలా చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో తపాల అసిస్టెంట్ సూపరింటెండెంట్లు ఉమామహేశ్వర్, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.19వేలు


అనంతపురం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8 వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు.

నేడే సీపీఐ వందేళ్ల వేడుకలు

ఉద్యమ కుటుంబాలకు సత్కారం

కేంద్ర, రాష్ట్ర నేతలు రాక

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్


మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం విద్య, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ఆవిర్భవించి వందేళ్లు కావడంతో గురువారం అనంతలో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఐది ఘన చరిత్ర అన్నారు. అలాంటి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. శతాబ్ది వేడుకలను గురువారం అనంతపురంలోని లలితకళాపరిషత్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకోసం పోరాటాలు సాగిస్తూ అమరులైన కుటుంబాలకు ఆత్మీయ సత్కారం చేస్తామన్నారు. వేడుకలకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, జాతీయ కార్యదర్శి రామక్రిష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నేతలు మల్లికార్జున, లింగమయ్య, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘరానా దొంగలు..!

తాళం వేసిన ఇళ్లే టార్గెట్... పగలు రెక్కీ.. రాత్రి చోరీలు

అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసిన పురం పోలీసులు

రూ.40 లక్షల బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్పీ సతీష్ కుమార్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్


స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు

హిందూపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడే ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను హిందూపురం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.40 లక్షల విలువచేసే బంగారం, వెండి ఆభరణాలు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం వివరించారు. పట్టుబడినవారిలో గుంటూరు జిల్లా కేంద్రానికి చెందిన బండికాళ్ల రత్నరాజు అలియాస్ తేజ (ప్రస్తుతం పరిగి మండలం గొల్లపల్లిలో ఉంటున్నాడు), హిందూపురం మండలం హనుమేపల్లికి చెందిన బాబుప్రసాద్ (ప్రస్తుతం కర్ణాటకలోని విధురాశ్వత్థంలో ఉంటున్నాడు), హిందూపురం మండలం సంతేబిదునూరుకు చెందిన గంగరాజు, ఉప్పర సురేష్, గౌరీబిదునూరుకు చెందిన సిద్దిక్ సాబ్ ఉన్నారు. హిందూపురం సబ్ డివిజన్‌లో 2023 నుంచి ఇప్పటి వరకూ నమోదైన చోరీ కేసులను ఛేదించేందుకు పోలీసులు నిఘా వేశారు. ఈ క్రమంలో సంతేబిదునూరుకు చెందిన పాత దొంగల ముఠా వెంట కొత్త వ్యక్తి తిరుగుతున్నాడని హిందూపురం అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులుకు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, వచ్చింది గుంటూరుకు చెందిన రత్నరాజు అని, చోరీల కోసం హిందూపురం ప్రాంతంలో రెక్కీ నిర్వహిస్తున్నారని తేలింది. దీంతో రత్నరాజును కూడా సీఐ అదుపులోకి తీసుకున్నారు. రత్నరాజు హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి, మేళాపురంలో మూడేళ్ల క్రితం చోరీకి పాల్పడ్డాడు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. మిగిలిన ముఠా సభ్యులపై హిందూపురం వన్‌టౌన్ పరిధిలో రెండు, టూటౌన్ పరిధిలో మూడు, అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, గోరంట్లలో రెండు, సోమందేపల్లి, లేపాక్షి, చిలమత్తూరు, కదిరి ఒక్కో చోరీ కేసు ఉన్నాయి. తమ విచారణలో నిందితులు నేరాలు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. వారి నుంచి 310 గ్రాములు బంగారం ఆభరణాలు, 3 కిలోలకుపైగా వెండి ఆభరణాలు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ముఠా సభ్యులు కర్ణాటక, ఏపీలో తాళం వేసిన ఇళ్లను ముందుగా గుర్తిస్తారు. పగటిపూట రెక్కీ నిర్వహించి, రాత్రిపూట ఇళ్లలో చొరబడి చోరీలు చేస్తుంటారు. దొంగల ముఠాను పట్టుకుని, కేసులను ఛేదించిన డీఎస్పీ మహేష్, సీఐలు ఆంజనేయులు, కరీం, రాజగోపాల్, జనార్దన్, ఎస్ఐ శ్రీధర్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వారికి రివార్డులను అందజేశారు.

యువ ఖైదీలే పెట్టుబడి

రత్నరాజు జైలుకు వెళ్లిన ప్రతి సందర్భంలో జైలులో ఉన్న యువఖైదీలతో పరిచయం పెంచుకుంటాడు. ఎక్కడ చోరీ చేస్తే బాగుంటుందని ఆరా తీస్తాడు. ఆ ప్రాంత పోలీసుల పనితీరు గురించి కూడా తెలుసుకుంటాడు. ఏ స్టేషన్ పరిధిలో పోలీస్ అధికారి గట్టిగా ఉన్నాడు అనే కోణంలో కూడా ఆరాతీస్తాడు. అన్నీ తెలుసుకుని.. జైలు నుంచి బయటికి వచ్చాక అనువైన ప్రాంతాలలో తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి లూటీ చేస్తాడు. చోరీ చేసిన సొమ్ములో కొంత మాత్రమే వెంట వచ్చిన తోడుదొంగలకు ఇస్తాడు. మిగిలిన సొమ్మంతా తానే తీసుకుంటాడు.

వీడు మామూలోడు కాదు..

గుంటూరుకు చెందిన బండికాళ్ల రత్నరాజు అలియాస్ తేజ వయసు 39 సంవత్సరాలు. ఇతను స్కెచ్ వేశాడంటే ఇంటి చుట్టూ పది మంది కాపలా ఉన్నా లూటీ కావాల్సిందే అని పోలీసులు అంటున్నారు. ఇంత ఆరితేరిన దొంగను ఇప్పటి వరకు తాము చూడలేదని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు జిల్లాలో నమోదైన మొదటి కేసులో జైలుకు వెళ్లిన సమయంలో ఖైదీలతో పరిచయం పెంచుకున్నాడు. బయటకు వచ్చాక ఆ ఖైదీలు ఉంటున్న ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డాడు. మొదట తాళం వేసిన ఇళ్లను గుర్తించి, రెక్కీ నిర్వహిస్తాడు. ఒకటి రెండు రోజులు ఆ ఇళ్ల వద్ద పరిస్థితిని గమనిస్తాడు. ఇంటికిగాని, గేటుకుగాని తాళం వేసి ఉండి.. రెండు మూడు రోజులు పగలు, రాత్రి ఇంటి ముందు లైటు వెలుగుతూ ఉంటే.. ఆ ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకుంటాడు. చోరీకి అనువైనదని భావిస్తాడు. ఆ తరువాత కొంత మంది దొంగలతో కలిసి ఇంటివద్దకు వెళ్తాడు. కానీ దొంగతనం చేసేది మాత్రం రత్నరాజు ఒక్కడే. పది మంది వెంట వెళ్లినా.. ఇంట్లోకి చొరబడి సొమ్ము తీసుకొచ్చేది అతనొక్కడే. ఎందుకంటే తన వెంట వచ్చిన దొంగలనే నమ్మడు. రత్నరాజుపై ఇప్పటి వరకూ 55 చోరీ కేసులు నమోదయ్యాయి. పోలీసుల దృష్టికి రానివి ఇంకెన్ని ఉంటాయో తెలియదు.

చోరీ సొమ్ముతో గుంటూరులో ఇళ్ల నిర్మాణం

ఇళ్లలో చొరబడి చోరీ చేసిన సొమ్ముతో తన సొంతూరు గుంటూరులో రత్నరాజు రెండు ఇళ్లను నిర్మిస్తున్నాడు. వీటి నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.2 కోట్లు ఖర్చయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఆ జిల్లా అధికారుల ద్వారా కోర్టు అనుమతితో ఇళ్లను అటాచ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో ఇద్దరే..!

తాడిపత్రిలో అధ్వానం... వైద్యుడు, అటెండరే దిక్కు

మందులు కూడా లేని దుస్థితి

కార్మికులకు తప్పని తిప్పలు



ఈఎస్ఐ ఆసుపత్రి

తాడిపత్రి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నాపరాళ్లు, గ్రానైట్, సిమెంట్, ఐరన్ తదితర పరిశ్రమలు వందల సంఖ్యలో తాడిపత్రి ప్రాంతంలో ఉన్నాయి. వాటిలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. అలాంటి కీలక ప్రాంతంలోని కార్మిక బీమా వైద్యశాలలో అన్నీ సమస్యలే. సిబ్బంది లేరు, సౌకర్యాలూ లేవు. వైద్యుడు, అటెండర్‌తోనే నెట్టుకొస్తున్నారు. ఫార్మాసిస్టు, నర్సు, క్లర్క్, స్వీపర్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ వేలాది కార్మిక కుటుంబాలు పరిశ్రమల్లో నివాసం ఉంటూ ఏ చిన్న ప్రమాదం జరిగినా ఈఎస్ఐ ఆస్పత్రికి వస్తున్నారు. ఇక్కడ సిబ్బంది, మందుల కొరతతో వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వైద్యం అందదన్న ఉద్దేశంతో చాలామంది ఆస్పత్రికి రావడమే లేదు. ఒకవేళ వెళ్తే ఉన్న మందులు ఇచ్చి.. మిగిలినవన్నీ బయట తీసుకోవాలని రాసి పంపుతున్నారు. ఆస్పత్రిలో కనీసం స్వీపర్ కూడా లేడంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మందులు లేక బయటకు పంపించారు: వీరప్ప



బీపీ, మధుమేహంతో బాధపడుతున్నా. వాటితోపాటు జ్వరం రావడంతో ఆస్పత్రికి వస్తే మధుమేహానికి మందులు లేకపోవడంతో బయటకు రాసిచ్చారు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

త్వరలోనే మందులు వస్తాయి: వెంకటేశ్వర్లు, వైద్యుడు



కొన్ని మందులు లేవనేది వాస్తవమే. ఇండెంట్ పెట్టాం. త్వరలోనే మందులు వస్తాయి. అన్ని మందులు ఆస్పత్రిలో ఇచ్చేలా చర్యలు చేపడతాం.

ఏళ్లుగా ఎదురుచూపు

వితంతువులకు అందని పింఛన్

కుటుంబ పోషణకు పలువురి ఇబ్బంది

సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ



పింఛన్లు నమోదు చేసుకునే సచివాలయం

అమడగూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పింఛన్ కోసం మండలంలోని పలువురు వితంతువులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో వారు ఆయా గ్రామాల అధికార పార్టీ నాయకులు, సచివాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పింఛన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే మరుసటి నెల నుంచే అతడి భార్యకు ఆయన పింఛన్‌ను అందిస్తున్న ప్రభుత్వం తమ పట్ల శీతకన్ను వేయడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి తమకు పింఛన్ అందిస్తే తమ కుటుంబాల జరుగుబాటుకు ఆసరాగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

రెండేళ్లు గడుస్తున్నా...: వెంకటమ్మ, ఎస్సీ కాలనీ



నా భర్త చనిపోయి రెండేళ్లకు పైబడింది. నాకు ఇద్దరు కుమారులు, కూలి పని చేస్తూ, పిల్లలను చదివించుకుంటున్నా. ఆస్తులు ఏ మాత్రం లేవు. ఉండటానికి ఇల్లు మాత్రమే ఉంది. వితంతు పింఛన్ అందిస్తే కొద్దిగా ఊరట కలుగుతుంది. అధికారులు స్పందించి పింఛన్ అందేలా చూడాలి.

సచివాలయంలో నమోదు చేయించా : మంజుల, మహమ్మదాబాద్



భర్తను కోల్పోయి మూడేళ్లు అయ్యింది. పింఛన్ కోసం సచివాలయంలో పలుమార్లు నమోదు చేయించా. అయినా పింఛన్ అందడం లేదు. ఆధార్, రేషన్‌కార్డు అన్ని ఇదే గ్రామంలో ఉన్నాయి. నాకు ఒక కుమారుడు, నామీదే ఆధారపడిన అవ్వ ఉన్నారు. నిత్యం కూలి పనికి పోతేనే ముద్ద నోట్లో దిగేది. పింఛన్ అందిస్తే కుటుంబ పోషణకు ఆసరాగా ఉంటుంది.

సైట్ ఓపెన్ కాగానే...: మునెప్ప, ఎంపీడీవో

కొత్త పింఛన్‌లకు దరఖాస్తు చేసుకునేందుకు సైటు ప్రారంభించలేదు. సైటు ఓపెన్ కాగానే అర్హులైన వారి పేర్లు నమోదు చేసి, తప్పనిసరిగా పింఛన్‌లు అందిస్తాం. ఎవరైనా ఆధార్, రేషన్‌కార్డు పక్క మండలాలలో ఉంటే అలాంటి వారికి అందించేందుకు వీలు కాదు. అర్హులైన వారికి తప్పనిసరిగా అందిస్తాం.

రేపు షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

బుక్కపట్నం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి షూటింగ్ బాల్ జట్లను శుక్రవారం ఎంపిక చేస్తామని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పూల ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సీనియర్ మహిళలు, పురుషుల విభాగంలో ఎంపిక పోటీలను బుక్కపట్నంలోని శ్రీసత్యసాయి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎంపికైన క్రీడాకారులు 19 నుంచి 21వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరిగే 44వ సీనియర్ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9573065966 నెంబరును సంప్రదించాలన్నారు.

నకిలీ సిమెంట్ బాగోతం బద్దలు

15 ఏళ్ల దందాలో రూ.కోట్ల ఆర్జన

విజిలెన్స్ దాడుల్లో గుట్టురట్టు

పెనుకొండ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒకటిన్నర దశాబ్ద కాలం నుంచి సాగుతున్న అక్రమ వ్యాపారం బాగోతం బట్టబయలైంది. విజయవాడకు చెందిన మహేష్ గోరంట్ల మండలం గుత్తివారిపల్లి సమీపంలో 15ఏళ్ల కిందట కస్తూరీ సిమెంటు ఫ్యాక్టరీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇక్కడి నుంచి లేపాక్షి సిమెంటు పేరుతో సిమెంటు తయారు చేయడానికి అనుమతి పొందాడు. అయితే అతడు నకిలీ సిమెంటు తయారు చేసి, ప్రముఖ కంపెనీల పేరుతో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. విజిలెన్స్ తనిఖీలో ఈ విషయం ఇటీవల వెలుగు చూసింది. నకిలీ సిమెంట్ తరలించడానికి తొలుత వివిధ రకాల సిమెంటు కంపెనీల పేర్లున్న ఖాళీ సంచులను తమిళనాడు నుంచి తెస్తారు. బయట లారీల్లో వచ్చిన బూడిద(ఫ్లైయాష్), 20శాతం సిమెంటు కలిపి ఆ సంచుల్లో నింపుతారు. దాన్ని ప్రముఖ సిమెంటు కంపెనీల పేరుతో కర్ణాటకకు తరలించి విక్రయిస్తాడు. ఒక సిమెంటు బస్తా తయారీకి రూ.50 ఖర్చవుతుండగా లాభం రూ.300 వస్తోంది. రసీదులు కూడా నకిలీవి తయారు చేయించి, కర్నూలు నుంచి ఇస్తూ నకిలీ సిమెంటు బస్తాలు తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. దీంతో గోరంట్ల పోలీస్‌స్టేషన్‌లో విజయవాడకు చెందిన నిర్వాహకుడు మహేష్‌పై క్రిమినల్ కేసు నమోదుచేశారు. 15ఏళ్లలో నకిలీ సిమెంటు తయారు చేసి దాదాపు రూ.43కోట్లు దోపిడీ చేశారని విజిలెన్స్ అధికారుల దాడుల్లో తేలింది. స్థానికులకు అనుమానం రాకుండా ఉండేందుకు సిమెంటు కంపెనీలో పనిచేసేందుకు ఇతర ప్రాంతాల వారిని పెట్టుకుని వ్యవహారం కొనసాగించాడు. నకిలీ వ్యవహారం బయటపడటంతో సిమెంటు ఫ్యాక్టరీ నిర్వాహకుడు పరారీలో ఉన్నాడు. గోరంట్ల పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు.

నకిలీ సిమెంటు పరిశ్రమ



పోస్టాఫీసుల నిర్మాణాలు చేపట్టండి

- లోక్‌సభలో ఎంపీ అంబికా



అనంతపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కూడేరు, కంబదూరు, గుత్తి మండలాల్లో పోస్టాఫీసుల నిర్మాణాలు చేపట్టి ప్రజలకు సేవలందించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర కమ్యూనికేషన్స్‌శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ మాట్లాడుతూ.. కూడేరు, కంబదూరు, గుత్తి మండలాల్లో పోస్టాఫీసుల పునరావృత మార్పుల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ మండలాల్లో శాశ్వత పోస్టాఫీస్ భవనాలు లేకపోవడంతో ప్రజలు అత్యవసర పోస్టల్ సేవల కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. శాఖ ఇప్పటికే సొంత భూములు కలిగి ఉన్నప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభంకాకపోవడంతో సేవలు అందుబాటులోకి వచ్చేందుకు ఆలస్యమవుతోందన్నారు. నిర్మాణాలు ఆలస్యం కావడంతో ఆ భూములు ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని ఎంపీ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు కేంద్ర మంత్రి పెమ్మసాని స్పందిస్తూ... కూడేరు, కంబదూరు, గుత్తి మండలాల్లో పోస్టాఫీస్ శాశ్వత భవనాల నిర్మాణంపై సమీక్ష చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

అనంతను అగ్రభాగాన నిలపాలి

ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి పిలుపు


మాట్లాడుతున్న ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అక్షర క్రమంలోనే కాదు.. పురోగతిలోనూ ఏడీసీసీ బ్యాంకును రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్ లోని సమావేశ మందిరంలో ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి బ్రాంచ్‌లు, వాటి పరిధిలోని సొసైటీల వారిగా పురోగతిని సమీక్షించారు. ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లు రూ.580 కోట్లు ఉందని, 2026 మార్చి నాటికి రూ.700 కోట్లకు సేకరించాలని మేనేజర్లను ఆదేశించారు. అదే విధంగా బ్యాంకు వ్యాపార టర్నోవర్ రూ.2080 కోట్ల నుంచి ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.2500 కోట్లకు పెంచాలని సూచించారు. త్వరలో బ్యాంకులో ఏకకాల రుణ పరిష్కార పథకం (ఓటీఎస్) అమలు చేసి, రైతులకు రుణవిముక్తి కల్పిస్తామని తెలిపారు. ఆప్కాబ్ డైరెక్టర్ సురేంద్ర రైతులకు అందించే పంట రుణాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో సీఈఓ సురేఖరాణి, డీజీఎంలు, సీనియర్ మేనేజర్లు, బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

సుపరిపాలనపై ఢిల్లీలో శిక్షణ తరగతులు

అనంతపురం వైద్యం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సే ప్రథమ కర్తవ్యంగా సమాజానికి ప్రయోజనం చేకూర్చేలా సుపరిపాలన ఎలా అందించాలన్న అంశంపై జిల్లా అధికారులకు ఢిల్లీలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లా నుంచి డీఆర్వో మలోల, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బు కోఠారి, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అశోక్ శిక్షణ తరగతులకు వెళ్లారు. ప్రభుత్వ రంగ నిర్వహణలో అధికార దుర్వినియోగాన్ని రూపుమాపడం, నైతిక ప్రవర్తనను పెంపొందించడం, ప్రస్తుత అవసరాలను భవిష్యత్తు తరాలకు సమతుల్యం చేయడం తదితర అంశాలపై ఇతర రాష్ట్రాలకు చెందిన మాజీ ఐఏఎస్, ఐపీఎస్‌లు, ఇతర ప్రముఖులతో తరగతులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పేదరికాన్ని తగ్గించి ఆర్థికాభివృద్ధి, సామాజిక ఐక్యత, స్థిరత్వంతో కూడిన సుపరిపాలన అందించి ప్రభుత్వాలపై ప్రజలకు నమ్మకం పెంచడమే శిక్షణ తరగతులు లక్ష్యం అన్నారు. సోమవారం నుంచి శుక్రవారం కొనసాగే తరగతుల్లో ఉపన్యాసాలు, పీపీటీ, వీడియోల ప్రదర్శనతోపాటు ఢిల్లీలోని పరిసర ప్రాంతాల స్థితిగతులపై సందర్శన ఉంటుందని తరగతులకు వెళ్లిన అధికారులు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా అయ్యప్ప మండల పూజ


గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్పస్వామి భక్తులు, మాలధారులు

కదిరి అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పనగర్‌లో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం మండల పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వ హించారు. అర్చకులు కుమారస్వామి ఆధ్వర్యంలో ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకం, గణపతి పూజ, పుష్పార్చన తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. రాత్రి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ వీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవం అనంతరం మాలధారులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ శంకరయ్య, వెంకటరమణ, కటికెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ, వివేకానంద, ప్రభుత్వ కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బుధవారం మానవహక్కుల దినోత్సవాన్ని ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. శ్రీసాయిడిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఫణికుమార్, న్యాయవాదులు భార్గవి, విజయ రాఘవేంద్ర, సుమలత, బాలసుందరి కేక్ కట్ చేసి మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. వివేకానంద డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్, న్యాయవాది భార్గవి విద్యార్థులతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ మాన వహక్కుల దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

నియామకం


మొహమ్మద్ సాదిక్ బాషా

కదిరి అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనను నియమించినట్లు పట్టణానికి చెందిన మొహమ్మద్ సాదిక్ బాషా తెలిపారు. ఈ మేరకు మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా నుంచి తాను బుధవారం నియామక పత్రం అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన సయ్యద్ బాషాకు, ఇందుకు సహకరించిన బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్క్రబ్ టైఫస్‌పై అవగాహన

గాండ్లపెంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కురుమామిడి పంచాయతీ రెక్కమాను ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ... స్క్రబ్ టైఫస్ వ్యాధిపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బాల్య వివాహాల అనర్థాల గురించి వివరించారు. సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, సిబ్బంది విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

గాండ్లపెంట/బత్తలపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేస్తున్న వేరుశనగ పంట లో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడు లు పొందుతారని మండల ఏఓ షాదాబ్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని కటారుపల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు షాజాద్, ఎంపీఈఓలు యామినీ, రైతులు పాల్గొన్నారు. అలాగే బత్తలపల్లి మండలపరిధిలోని మాల్యవంతం గ్రామంలో వ్యవసాయాధికారులు బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కంది, ఆముదం పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఏఓ ఓబిరెడ్డి, సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

పగలే ల్యాప్‌టాప్ చోరీ

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లింగిశెట్టి పాళ్యం వీధిలో బుధవారం ఉదయం ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తి రూ.1.10లక్షల విలువచేసే ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను అపహరించారు. ఈ మేరకు బాధితురాలు సాఫ్‌వేర్ ఉద్యోగిని మౌళిక తమ్ముడు భార్గవ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫి ర్యాదు చేశాడు. లింగిశెట్టి పాళ్యం వీధిలో ఉన్న తన ఇంట్లో మౌళిక బుధవారం ఉదయం 8గంటల సమయంలో టేబుల్‌పై ల్యాబ్‌టాప్, సెల్‌ఫోన్ పెట్టి వర్క్ చేసుకుంది. అనంతరం పనిఉండటంతో మిద్దెపైకి వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లోని లోపలి గదిలో ఆమె తల్లి, తమ్ముడు ఉన్నారు. ఆ సమయంలో ఇంటికున్న గేటు శబ్దం రావడంతో ఎవరో వచ్చారని ఇంట్లో ఉన్న కుటుంబసభ్యులు బయటకు వెళ్లి చూశారు. అక్కడ ఎవరూ కనిపించలేదుగానీ, గేటు ఓపెన్ చేసి ఉంది. బయట గదిలో టేబుల్‌పై ఉన్న ల్యాబ్‌టాప్, సెల్‌ఫోన్ కనిపించలేదు. దీంతో బాధితురాలు మౌళిక, ఆమె తమ్ముడు భార్గవ వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

తనకల్లు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఉన్న ఎరువుల దుకాణాలను బుధవారం వ్యవసాయాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధర్మవరం ఏడీఏ లక్ష్మీనాయక్, ఏఓ ముస్తఫా, తనకల్లు ఏఓ భారతి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. వారితోపాటు వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కొత్తచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 20 మంది పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను అదే గ్రామానికి చెందిన జేసీబీ చలం బుధవారం అందజేశారు. అదే విధంగా ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (పీఆర్‌డీఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.15 వేలు విలువ చేసే క్రీడా పరికరాలను పాఠశాలలోని విద్యార్థులకు అందజేశారు. అదేవిధంగా ఓబుళదేవరచెరువు మండలంలోని తంగేడుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యా ర్థులకు పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఇదే పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న చంద్రకళ తన తండ్రి చెన్నారెడ్డి జ్ఞాపకార్థం విద్యార్థులకు పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు.

టీడీపీ ఆర్థిక సాయం

నంబులపూలకుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఇటీవల తండ్రి వెంకటరమణ, కుమారుడు రమేష్ మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను బుధవారం టీడీపీ నాయకులు పరామర్శించి, రూ. పదివేలు ఆర్థికసాయం అందించారు. రమేష్ కర్నూల్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈవిషయం తెలుసుకుని, తండ్రి కూడా ఇటీవలే మృతిచెందారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామని, ఆయన ఆదేశాల మేరకు ఆర్థికసాయం అందచేశామని వారు తెలిపారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ దండే రవి, వాటర్ షెడ్ చైర్మన్ మహ బూబ్ బాషా, నాయకులు రాహుల్‌బాబా, ఇంతియాజ్, వంకమద్ది రవి, రెడ్డెప్ప, గంగాధర్, ఆజాద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దారి పొడవునా కంపచెట్లు

- మలుపుల వద్ద ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


సుబ్బారావుపేట-గొట్లూరు దారిలో మలుపు వద్ద పెరిగిన కంపచెట్లు


తుంపర్తి-మల్లాకాల్వ రహదారిని కమ్మేసిన కంపచెట్లు

ధర్మవరం రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల పొడవునా కంపచెట్లు ఏపుగా పెరిగి రోడ్లపైకి వచ్చాయి. రోడ్లకు ఇరువైపులా ఇలా ఉండడంతో ఆయా గ్రామస్థులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల వద్ద దారి కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వారు వాపోతున్నారు. మండలపరిధిలోని సుబ్బారావుపేట ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీ, గొట్లూరుకు వెళ్లే రహదారిలో కంప చెట్లు రోడ్డుకు అడ్డంగా పెరిగాయి. దీంతో మలుపుల వద్ద రోడ్డు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. తుంపర్తి నుంచి శ్మశానవాటికకు, మల్లాకాల్వకు వెళ్లే రహదారిలో కంపచెట్లు విపరీతంగా పెరిగి వెళ్లేందుకు వీలులేకుండా ఉందని గ్రామస్థులు వాపో తున్నారు. కంపచెట్లు రోడ్డుకు అడ్డంగా పెరగడంతో ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మలుపుల వద్ద కంపచెట్లు విపరీతంగా పెరగడంతో ద్విచక్రవాహ నాలు ఎదురె దురుగా ఢీకొని ప్రమాదాలు బారిన పడ్డామని పలువురు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు అడ్డంగా పెరిగిన కంపచెట్లను తొలగించి, మలుపుల వద్ద కని పించేలా సూచికబోర్డులు, ఏర్పాటుచేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

ఏమిటీ ఆహారం?

- కాలం చెల్లిన పౌష్టికాహారం ఎలా పంపిణీ చేస్తారు?
- ఐసీడీఎస్ అధికారులపై ఫుడ్ కమిషన్ సభ్యురాలి ఆగ్రహం


ఐసీడీఎస్ అధికారులను మందలిస్తున్న గంజిమాల దేవి

కొత్తచెరువు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన పౌష్టికారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎలా పంపిణీ చేస్తారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి ఐసీడీఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక గాంధీ నగర్ పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయ్యే పౌష్టిక ఆహారంపై తేదీ, నెల, సంవత్సరం పరిశీలించిన తర్వాతనే తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కాలపరిమితి ముగియడానికి కేవలం ఐదు రోజులున్న అటుకులను గర్భిణులకు ఎలా పంపిణీ చేస్తారని అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి మళ్లీ ఇలా జరిగితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. పిల్లలకు వండిన ఆహారాన్ని రుచి చూశారు. గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. అనంతరం గాంధీనగర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా చేసిన ఏజెన్సీ నిర్వాహకులను ఆమె శాలువాలతో సత్కరించారు. తర్వాత బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఆమె వెంట విద్యాశాఖ ఏడీ విజయ్ మోహన్, ఎంఈఓ జయచంద్ర, ఐసీడీఎస్ సీడీపీఓ జయంతి, సూపర్ వైజర్లు రజిత, భారతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

● పుట్టపర్తి రూరల్: మునిసిపాలిటీ పరిధిలోని ఎనములపల్లి-2 అంగన్‌వాడీ కేంద్రాన్ని గంజిమాల దేవి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫుడ్ స్టాక్ రిజిస్టర్ నిర్వహణ, కోడిగ్రుడ్ల పరిమాణం సక్రమంగా ఉండటంపై సంతృప్తి వ్య క్తం చేశారు. అనంతరం ఆమె ముని సిపల్ పరిధిలోని కుమ్మరిపేట రేషన్ షాపు (కోడ్ 1249038)ను పరిశీలించారు. రేషన్‌కార్డుదారులకు నిత్యావసర వస్తువు ల సరఫరాను పరిశీలించారు. జిల్లాలో ప్రజలకు నాణ్యమైన పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గంజిమాలదేవి పేర్కొన్నారు.

కార్యకర్తలకు అండగా పార్టీ

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్


ప్రమాద బీమా పత్రాన్ని అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచేది ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. ముదిగుబ్బ మండలం ఎనుములవారిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త గంగులప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గంగులప్పకు టీడీపీ సభ్యత్వం ఉండడంతో పరిటాల శ్రీరామ్ చొరవ తీసుకొని వివరాల్ని పార్టీ కార్యాలయానికి పంపారు. దీంతో గంగులప్ప కుటుంబానికి మంజూరైన రూ.5లక్షల ప్రమాద బీమా పత్రాన్ని పరిటాల శ్రీరామ్ అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఇది పార్టీ నుంచి అందుతున్న సాయం మాత్రమేనని... భవిష్యత్తులో ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆ కుటుంబసభ్యులు పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, నాయకులు చినగాని నరసింహ యాదవ్, బండి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు పట్టణంలోని జీవన్‌జ్యోతి పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్టు ఆ పాఠశాల హెడ్ మిస్ట్రెస్ సిస్టర్ సుజాత తెలిపారు. గతనెల 18న అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ హాకీ పోటీలలో ధర్మవరం జీవన్‌జ్యోతి పాఠశాల విద్యార్థినులు ఉషశ్రీ, మనుస్మృతి, సాయి సత్తాచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లాలో గురువారం నుంచి ఈ నెల 13వతేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రిన్సీ, హెడ్ మిస్ట్రెస్ సిస్టర్ సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

● ఓబుళదేవరచెరువు: రాష్ట్ర టి-10 టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో జీవన్‌జ్యోతి విద్యార్థులు ఘనవిజయం సాధించినట్లు జట్టు కోచ్ రమేష్‌నాయక్, హెడ్‌మిస్ట్రెస్ సిస్టర్ దాలియా తెలిపారు. కర్నూల్ జిల్లా డోన్ పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి టి-10 టెన్నీస్ బాల్ క్రికెట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్‌జూనియర్ బాలుర టోర్నమెంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 15 జట్లు పోటీ పడ్డాయన్నారు. డిసెంబర్ 7న జరిగిన ఫైనల్స్‌లో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచిందన్నారు. ఈ జట్టులో 95 శాతం మంది జీవనజ్యోతి పాఠశాల విద్యార్థులే ఉండటం గర్వకారణమన్నారు. రాష్ట్ర స్థాయిలో రాణించిన విద్యార్థులను హెడ్‌మిస్ట్రెస్ దాలియా, పీఈటీ షబ్రీన్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఎమ్మెల్యే కందికుంట సుడిగాలి పర్యటన


రెడ్డివారిపల్లిలో హరినాథ్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

తనకల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం సుడిగాలి పర్యటన చేపట్టారు. మండలపరిధిలోని రెడ్డివారిపల్లిలో గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టీడీపీ సీనియర్ నాయకుడు దేశాయి హరినాథ్‌రెడ్డి ఇంటికి కెళ్లి పరామర్శించారు. అలాగే సీనియర్ నాయకుడు దేశాయి జయచంద్రారెడ్డి ఇంటికెళ్లి పరామర్శించారు. అనంతరం మండలంలోని తులసేనాయక్ తండాకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో గాయపడిన జయకుమార్‌నాయక్‌ను పరామర్శించారు. పోమేనాయక్ తండాకెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటరమణ నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. తవళం పంచాయతీలోని సాపిరెడ్డిపల్లిలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాజశేఖర్, వెంకటరమణ కుటుంబాలను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు టీడీపీ మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శంకర్‌నాయుడు, రాజారెడ్డి, దేశాయి విధురశేఖర్ రెడ్డి, బాగేపల్లి చలపతి, కావడి ప్రవీణ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ల్యాబ్ భవనాన్ని ప్రారంభించండి: సీపీఐ

కదిరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తలుపుల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నిర్మించిన పబ్లిక్ హెల్త్ ల్యాబ్ భవనాన్ని ప్రారంభించాలని సీపీఐ మండల నాయకులు జగలి ఈశ్వరయ్య, హస్సాన్, అశోక్ బుధవారం ఆర్డీఓ వీవీఎస్ శర్మకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన ఉన్నతాధికారులతో చర్చించి ల్యాబ్ భవనాన్ని ప్రారంభిస్తామని వారికి హామీ ఇచ్చారు.

15న వైద్యశిబిరం

నల్లమాడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ఈ నెల 15న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ బుధవారం తెలిపారు. ఎ స్కై మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజలు అన్ని వ్యాధులకు చికిత్సలు చేయించుకోవచ్చన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం

తనకల్లు, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రబీ విత్తన వేరుశనగ కాయల పంపిణీని బుధవారం పంపిణీ ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టారు. పంపిణీలో సెరికల్చర్ అసిస్టెంట్ అరుణ, రైతులు శ్రీరాములనాయక్, రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ రమణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలి

- యూటీఎఫ్ నాయకులు



ధర్మవరంలో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం/పుట్టపర్తి టౌన్/కదిరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ధర్మవరం, పుట్టపర్తి, కదిరి పట్టణాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ మహేశ్‌కు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణనాయక్, ధర్మవరం డివిజన్ నాయకులు అంజనేయులు, అమర్‌నారాయణరెడ్డి, లక్ష్మయ్య, సురేశ్, చంద్రశేఖర్, రాంప్రసాద్, లతాదేవి, నాగేంద్రమ్మ, యాస్మిన్, సుల్తానా, శ్రీలత, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. పుట్టపర్తి ఆర్డీఓ అనంతరం ఆర్డీఓ సువర్ణకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ, కందుకూరి శివ, బాబు, ఆదినారాయణ, పర్వతయ్య, రమేష్, బాబు, రాజేష్, తిరుపాలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. కదిరి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కదిరిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి డి. శ్రీనివాసులు, జిల్లా కార్య దర్శులు చెన్నూరు తాహేర్‌వలి, సుబ్బా రెడ్డి, జిల్లా నాయకులు మల్లికార్జున, ఆజంబాషా, సునీల్ కుమార్, సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లా నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో వెంటనే రివ్యూ పిటిషన్ చేయాలని, పార్లమెంట్‌లో ఆర్టీఈ యాక్ట్‌సెక్షన్(1)ను సవరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో సింగల్ టీచర్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇప్పటికే బదిలీలు పొంది వారి స్థానాల్లో కొత్త వారు రాక అక్కడే కొనసాగుతున్న టీచర్లను వెంటనే బదిలీ స్థానాలకు రిలీవ్ చేయాలన్నారు. రెండో శనివారం, ఆదివారాల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక తరగతులు నిర్వహించ రాదన్నారు.

హిందూ సమ్మేళనం పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు

ధర్మవరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ బాలుర కళాశాల క్రీడామైదానంలో ఈనెల 21న నిర్వహించే హిందూ సమ్మేళనం పోస్టర్లను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఆవిష్కరించారు. పట్టణంలోని ఎన్డీఏ కార్యాల యంలో వాటిని ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ... ధర్మవరంలో జరగనున్న ఈ హిందూ సమ్మేళనం సమాజ ఐక్యతకు, హిందూధర్మ పరిరక్షణకు, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చే వేదికగా నిలుస్తుందన్నారు. కుల, వర్గాలకు అతీతంగా పిల్లలు, యువత, మహిళలు, కుటుంబసభ్యులంతా పెద్దసంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశ్వహిందూపరిషత్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేక శ్రీధర్‌రెడ్డి ఆరోపణలు

- విజిలెన్స్ విచారణకు సిద్ధం: మాజీ మంత్రి పల్లె


మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలను మునుపెన్నడూ లేని విధంగా ఘనంగా నిర్వహించామని, ఈ సందర్భంగా పుట్టపర్తిలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. అభివృద్ధి పనుల్లో అవకతవకలుంటే రాతపూర్వకంగా ఫిర్యాదుచేయాలని, విజిలెన్సుతో విచారణ చేయంచడానికి సిద్ధంగా ఉన్నామని శ్రీధర్‌రెడ్డికి సూచించారు. ఆయన బుధవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా పట్టణంలో నిర్మించిన మరుగుదొడ్ల విషయంలో కుంభకోణమంటూ శ్రీధర్‌రెడ్డి హడావుడి చేస్తున్నారన్నారు. పుట్టపర్తి అభివృద్ధిని అడ్డుకోవడమే శ్రీధర్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత ఆర్టీసీ డిపో, శిశుసంక్షేమ హాస్టళ్లు, పంచాయతీ ఇంజనీరింగ్ కార్యాలయాలు సగం పట్టణంలోని ఇరిగేషన్ ల్యాండ్‌లోనే ఎన్నాళ్లగానో ఉన్నాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. ఇరిగేషన్ ల్యాండ్‌లో కొత్తగా శాశ్వత నిర్మాణాలను ఎక్కడైనా నిర్మించి ఉంటే చూపాలన్నారు. మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి అభివృద్ధిని కోరుకునే మంచినాయకుడని, ఆయన్ను బెదిరిస్తున్నారని చెప్పడం పూర్తిగా అసత్యమన్నారు. అలాంటి సంస్కృతి మాది కాదని, మేం ప్రజాసేవ మాత్రమే చేస్తామన్నారు. పుట్టపర్తి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం ఆపకపోతే ప్రజలే శిక్షిస్తారన్నారు. పుట్టపర్తి ప్రశాంతతను అడ్డుకునే అసాంఘిక శక్తులపై పోలీసులు ఇప్పటికే కఠినంగా వ్యవహరిస్తున్నారన్నారు. పద్ధతి తప్పి మాట్లాడడం, తప్పుదారి పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. 2029 ఎన్నికల్లో మీఅడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ తగదు

- వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రవేటీకరణకు కూటమి ప్రభుత్వ నిర్ణయం తీసుకోవడం ప్రజాప్రయోజనాలకు విరుద్ధమని వైసీపీ యోజకవర్గ సమన్వయకర్త దుద్దుకుంట శ్రీదర్‌రెడ్డి విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రవేటీకరణ నిర్ణయాన్ని వ్యతికేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం ప్రతులను సమీకరించిన నాయకులతో కలసి ఆయన బుధవారం వైసీపీ స్థానిక కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు ఉచిత వైద్య విద్య వైద్యం అందించాలన్న ధ్యేయంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి పునాది వేశామని, అందులో ఐదు పూర్తి చేశామన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మిగిలిన కాలేజీలను పీపీపీ పద్ధతిలో కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. పీపీపీ పద్ధతిని వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల ఉద్యమంలో 62వేల సంతకాలు సమకూరినట్లు తెలిపారు. వీటిని జిల్లా సమన్వయం కర్త ఉషాశ్రీచరణ్ ఆధ్వర్యంలో గవర్నర్‌కు పంపనున్నట్లు తెలిపారు. అలాగే పుట్టపర్తిలో తాత్కాలిక మరుగుదొడ్ల పేరుతో రూ. 80 లక్షల బిల్లులతో పాటు అక్రమ పనులకు బిల్లులు చేయమని మున్సిపల్ చైర్మన్‌పై ఒత్తిడి చేయడం ప్రజాసామ్య విరుద్ధమని పేర్కొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కారం

నంబులపూలకుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎగువతూపల్లికి చాల యేళ్ల నుంచి రోడ్డు లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతుండేవారు. రైతులు పంట పొలాల్లోకి వెళ్లాలన్నా కష్టంగా ఉండేది. పంటలు సాగుచేసినప్పుడు చాలా ఇబ్బందులు పడేవారు. తమ సమస్యను ఇటీవల గ్రామస్థులు మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహసీల్దార్ దేవేంద్రనాయక్ గ్రామానికెళ్లి రైతులతో సంప్రదించి, గ్రామస్తుల సమక్షంలో రోడ్డు మార్గానికి అనుమతులు తీసుకున్నారు. బుధవారం పంచాయతీ నిధులతో మట్టి రోడ్డు వేయడానికి భూమి పూజ చేశారు. రోడ్డుకు సహకరించిన ఎమ్మెల్యేకి, అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పార్థసారథి, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి నరసింహులు, సర్పంచ్ చంద్రకళ, మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు, మాజీ ఎంపీటీసీ రామాంజులు, పౌల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అంజనప్పనాయుడు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

పరిగి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థినులకు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మహంతేజ్ బృందం బుధవారం ఆర్థికసాయాన్ని అందించింది. భజంత్రి గోపాల్ గుండెపోటుతో మృతిచెందడంతో అతడి కుమార్తెలు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న మహంతేష్, ఉపాధ్యాయులు తమవంతు సాయంగా రూ.32వేలు ఆర్థిక సాయాన్ని అర్షిత, వందనలకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన అర్షిత, వందనలకు తాము అండగా ఉంటామన్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలంలో కంచె తొలగింపు

గోరంట్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూపురం రహదారి పక్కన ఎస్సీ హాస్టల్ ముందున్న ప్రభుత్వ స్థలంలో వేసిన కంచెను పంచాయతీ అధికారులు బుధవారం తొలగించారు. ఆ స్థలంలో కంచె వేసిన విషయాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ మారుతి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు వెంటనే స్పందించారు. గోరంట్ల మేజర్ పంచాయతీ కార్యదర్శి సాయిసంజేయ్ నాయక్ బండలు, కంచెను తొలగించారు. హాస్టల్ ముందున్న స్థలం రోడ్డు, భవనాల శాఖకు చెందినదిగా పంచాతీయ కార్యదర్శి తెలిపారు.

ఆక్రమణ వాస్తవమే..

గొర్రెల పెంపక క్షేత్రం భూమికి హద్దులు చూపిన అధికారులు

పెనుకొండ టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మడకశిర వెళ్లే రహదారిలో ఓ రిసార్టు నిర్వాహకులు రోడ్డుమాటున రూ.కోటి భూమి మాయచేసి గొర్రెల పెంపక క్షేత్రం భూమిని కబ్జాచేశారన్న కథనంతో రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు సర్వేచేసి ఆక్రమణ జరిగిందని నిగ్గుతేల్చారు. బుధవారం మూడోసారి సర్వేచేసి గొర్రెల పెంపక క్షేత్రం అధికారులు, రిసార్ట్ నిర్వాహకులు సర్వేయర్లతో ఆర్ఐ షాషా హద్దులు వేయించారు. 807సర్వేనంబరులో గొర్రెల పెంపక క్షేత్రం భూమిలో వేసినట్లు తేల్చిచెప్పారు. గొర్రెల పెంపక క్షేత్రం సిబ్బంది వారి హద్దులను వేసుకుంటామని తెలిపారు.

సిబ్బంది రాత్రిపూట అందుబాటులో ఉండాలి

డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్ఓ

అగళి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది రాత్రిపూట కూడా అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ ఫైరోజ్‌బేగం అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యంపై ఆరాతీశారు. ల్యాబ్‌లో రికార్డులు పరిశీలించారు. 24గంటల ఆసుపత్రిలో సిబ్బంది రాత్రిపూట కూడా అందుబాటులో ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పీహెచ్‌సీ సెంటర్లు మూసివేయడానికి అనుమతిలేదని సూచించారు. అలా పీహెచ్‌సీని మూసివేస్తే సిబ్బందిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివానంద, చిదానందప్ప, భూషణ్‌నాయక్, ఫార్మాసిస్ట్, స్టాఫ్‌నర్స్ పాల్గొన్నారు.

● **గుడిబండ:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం బుధవారం పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని రికార్డులు మందులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక బృందాలు

సీఐ రాఘవన్

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటుచేసినట్లు సీఐ రాఘవన్ తెలిపారు. బుధవారం సోమందేపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. పెనుకొండలో గంజాయి విక్రేతలు, సేవించేవారిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమందేపల్లి పేరు ఎక్కువగా వినిపిస్తున్నందున ఇక్కడ దృష్టిసారించినట్లు తెలిపారు. ఇప్పటికే పలువురిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలన్నారు. పోలీసులకు పట్టణ ప్రజలు, సహకరించాలన్నారు. గంజాయి సేవిస్తున్నవారిని ఇదివరకే కొందరిని గుర్తించామన్నారు. అనుమానితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారిస్తామన్నారు. గంజాయితో పట్టుబడిన వారిని ఉపేక్షించేదిలేదని తెలిపారు. ఇప్పటికే 16 మందిపై బైండోవర్ కేసు నమోదుచేసినట్లు తెలిపారు. తిరిగి పట్టుబడితే జైలుకు పంపుతామన్నారు. గంజాయి బ్యాచ్ ఆగడాలను సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిపారు. వారెవరైనా వారి వెనుక ఎవరున్నా వదిలిపెట్టమన్నారు. సోమందేపల్లిని గంజాయిరహిత ప్రాంతంగా మార్చడానికి పూర్తిస్థాయిలో చర్యలు చేపడుతున్నామన్నారు. గంజాయి బ్యాచ్‌లవల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకపై ఏ చిన్న పొరపాటును సైతం సహించమన్నారు. గంజాయి సరఫరాచేసేవారు, తెచ్చుకునేవారు పట్టుబడితే కేసు నమోదుచేస్తామని గంజాయి బ్యాచ్ తోలుతీస్తామని హెచ్చరించారు. ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నడ భాష ఉనికిని కాపాడుకుందాం

కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు

పావగడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కన్నడ భాష ఉనికిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు నరసింహమూర్తి అన్నారు. కన్నడ భాష పరిరక్షణకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. కన్నడ భాష ఉనికి బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యువకర్ణాటక అధ్యక్షుడు మిర్చి గోపాల్, పవన్ తదితరులు హాజరయ్యారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

గోరంట్ల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో 60 మంది వృద్ధులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, బైసాని శ్రీనివాసగుప్తా, జీఎం సురేష్, నాగరాజు, ఆదినారాయణ దుప్పట్లు అందించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు దేవరాజుస్వామి, శ్రీనివాసగుప్త, రమేష్, వృషభదేవుడు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: మండలంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రమంలో పావగడకు చెందిన రమామణి బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. దీంతో ఆశ్రమ అధ్యక్షుడు తిమ్మారెడ్డి.. ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్షలు వెచ్చించారు... మూలన పడేశారు..!

సచివాలయాల్లో పనిచేయని ఫైబర్ నెట్‌వర్క్

ఇబ్బంది పడుతున్న సిబ్బంది

లబ్ధిదారులకు సకాలంలో అందని సేవలు



నిరుపయోగంగా ఉన్న ఫైబర్ నెట్‌వర్క్

మడకశిర రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ సేవలు పనిచేయకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు సకాలంలో సేవలు అందించలేకపోతున్నారు. మండలంలో 18 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. 133 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అన్నీ సచివాలయాలోను నెట్‌వర్క్ సమస్య వేధిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఎంతో ఆర్భాటంగా సచివాలయాల్లో ఫైబర్‌నెట్ ఏర్పాటుచేశారు. ఇందుకోసం ఒక్కో సచివాలయానికి దాదాపు రూ.2 లక్షల వ్యయంతో సంబంధిత పరికరాలు సమకూర్చారు. అయితే వాటికి నెట్‌వర్క్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో దాదాపు ఐదేళ్లుగా సచివాలయాల్లో అవి నిరుపయోగంగా ఉన్నాయి. అందులో పనిచేసేవారు నెట్ కనెక్షన్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు సచివాలయ సిబ్బందే సొంత ఖర్చులతో సెల్‌ఫోన్, హాట్‌స్పాట్ ద్వారా నెట్‌వర్క్‌ను కంప్యూటరుకు కనెక్ట్ చేసుకుని పనిచేస్తున్నారు. కొన్ని సమయాల్లో పని అధికంగా ఉండడం, నెట్ వర్క్ పనిచేయకపోవడంతో ప్రజలకు అందాల్సిన సేవలు సకాలంలో అందడంలేదు. వివిధ సేవల కోసం వచ్చే చాలా మంది నిరాశతో వెనుతురుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని గ్రామ సచివాలయాలకు నెట్‌వర్క్ కనెక్షన్లు ఇచ్చి మెరుగైన సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ సోనీబాయ్‌ని వివరణ కోరగా సచివాలయాల్లో పనిచేయని ఫైబర్ నెట్‌వర్క్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా..?

నాశిరకం ధాన్యం, కాలం చెల్లిన ఆహార పదార్థాలు

పిల్లలకు ఇలాంటివి ఎలా వడ్డిస్తారు..?

మరోసారి ఇలా వ్యవహరిస్తే కఠిన చర్యలు

ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్‌పై

ఆహార కమిషన్ సభ్యురాలి ఆగ్రహం



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న గంజిమాలదేవి

లేపాక్షి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం వంటలు వండటంలేదు... పాలు, ఆహార పదార్థాలు అన్నీ ఎక్స్‌పైర్ అయినవే ఉన్నాయి.. ఇలాంటి వాటితో విద్యార్థులకు ఆహారం పెడితే వారి ఆరోగ్యం ఏమి కావాలి..? ఇలా వ్యవహరిస్తున్న మీకు ఎందుకు మెమో ఇవ్వకూడదు.. అని ఆహార కమిషన్ రాష్ట్ర సభ్యురాలు గంజిమాలదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. స్టోర్‌రూంకు వెళ్లి కూరగాయలను పరిశీలించారు. అవి నాశిరకంగా ఉండటాన్ని గమనించారు. అదేవిధంగా పాలు, పెరుగు ప్యాకెట్లను పరిశీలించగా అవి ఎక్స్‌పైర్ అయ్యాయి. దీంతో ఆమె ప్రిన్సిపాల్ సుందర్‌రాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా మీరు ఎలా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. పిల్లల ఆరోగ్యం ఏమి కావాలన్నారు. అనంతరం పిల్లలను నేరుగా వెళ్లి పలకరించారు. చికెన్ సక్రమంగా ఇవ్వడంలేదని, నీళ్లచారు మాత్రమే వడ్డిస్తున్నారని, పది రోజులుగా చిక్కీలు కూడా ఇవ్వడంలేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. 1100 మంది విద్యార్థులున్న పాఠశాలలో అన్నీ సక్రమంగా నాణ్యమైనవి అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా మెనూ ప్రకారం పిల్లలకు అందించాలని ఆదేశించారు. మరోసారి ఇలా జరిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజునాయక్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

శిల్పకళ అద్భుతం

దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలోని శిల్పకళలు అద్భుతమని ఆహార కమిషన్ రాష్ట్ర సభ్యురాలు గంజిమాలదేవి అన్నారు. బుధవారం ఆమె ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించారు. ఆలయంలోని శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, ఎంఈఓ నాగరాజునాయక్, రెవెన్యూ సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

మోడల్ పేపర్ల అందజేత

రొద్దం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దమంతూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో టీడీపీ నాయకులు రాము బుధవారం విద్యార్థులకు మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం రాయుడు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరేష్, ఎస్ఎంసి చైర్మన్ రామాంజనేయులు, రమేష్, గంగాధర్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

మడకశిర రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ రమేష్ సూచించారు. బుధవారం నీలకంఠాపురం ఏపీ గ్రామీణ బ్యాంకును పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఆపద సమయంలో కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ భరత్‌శ్రవణ్, ఫీల్డ్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దివ్యాంగుడి విరాళం



విరాళం అందజేస్తున్న దివ్యాంగుడు శివప్ప

గోరంట్ల, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పాలసముద్రం మోడల్ ప్రైమరీ పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం కోసం పాఠశాల కమిటీ సభ్యుడు, దివ్యాంగుడు మొద్దు శివప్ప రూ.30వేల విరాళం బుధవారం అందించారు. ఎంఈఓ గోపాల్ ఆధ్వర్యంలో హెచ్ఎం నీలం అశోక్‌కు నగదును అందించారు. ఈ సందర్భంగా శివప్పను ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



హోమంలో పాల్గొన్న మాలధారులు

పెనుకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉంటుందని గురుస్వామి మోహన్ తెలిపారు. అదేవిధంగా మహానంది, సుబ్రహ్మణ్యస్వామి, కేతువు విగ్రహప్రతిష్ఠాపనతోపాటు కుంభాభిషేకం ఉంటుందన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని సూచించారు. కాగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను పంచాంగం నాగప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

హక్కుల అమలు భావితరాలకు స్ఫూర్తి

ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప

పెనుకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హక్కుల అమలు భావితరాలకు ఆదర్శంగా ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప పేర్కొన్నారు. బుధవారం స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో రాజనీతి శాస్త్రం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కులపట్ల అప్రమత్తంగా ఉండాలని లేనిపక్షంలో అవి హరించి పోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. అదేవిధంగా స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ పీఓ శివన్న, శ్రీలేఖ, రవికుమార్, ఆర్ఆర్‌సీ జయప్రకాశ్ పాల్గొన్నారు.

'పంటల రక్షణకు జాగ్రత్తలు పాటించాలి'

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వేరుశనగ, రాగి, వరి, మొక్కజొన్న పంటలు వేసిన రైతులు వాటికి ఎరువులు, మందులు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఏఓ విజయభారతి తెలిపారు. బుధవారం మండలంలోని తుంగోడు, వెలిదడకల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ సమయంలో ఎంత మోతాదులో మందు పిచికారి చేయాలో వివరించారు. రబీలో పంటలు వేసిన రైతులు ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అలైఖ్య, ఎంపీఈఓ ధనుంజయ, రామిరెడ్డి, సోశేఖర్‌రెడ్డి, అశ్వర్థ, రామచంద్ర, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

రొద్దం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రొద్దం ప్రభుత్వ ఆసుపత్రిలో పెనుకొండ ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత మంత్రి సవిత ఆధ్వర్యంలో గర్భిణులకు బుధవారం అన్నదానం చేశారు. ప్రతినెలా గర్భిణులకు అన్నదానం నిర్వహించడం జరుగుతోంది. కార్యక్రమంలో వైద్యాధికారులు సోమశేఖర్, భాగ్యలక్ష్మీ, సీహెచ్ఓ శశికళ, టీడీపీ నాయకులు కిష్టప్ప, చెన్నకేశవులు, సిద్ధన్న, లింగప్ప పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా.. ఇద్దరికి గాయాలు

గోరంట్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని బెంగుళూరు రహదారిలో బూదిలి సచివాలయం వద్ద ద్విచక్రవాహనం బోల్తా పడి తేజ, చరణ్ బుధవారం రాత్రి గాయపడ్డారు. కొత్తచెరువుకు చెందిన తేజుకు సంబంధించి పంట నూర్పిడి యంత్రం గోరంట్ల సమీపంలో ఉంది. యంత్రం పరిశీలనకోసటు తేజ ద్విచక్రవాహనంలో పుట్టపర్తి మండలం ఇరగరాజుపల్లి చెందిన బంధువు చరణ్‌తో కలిసి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు చికిత్సలు చేశారు. తేజకు తలకు బలమైన గాయం అయి చెవినుంచి రక్తం వస్తుండడంతో చికిత్సల నిమిత్తం బెంగుళూరు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన చరణ్ 108 వాహనంలో హిందూపురం తరలించినట్లు వైద్యులు తెలిపారు.

కార్యవర్గం ఎంపిక

మడకశిర టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా నరసింహులు వ్యవహరించారు. అధ్యక్షుడిగా రాము, అసోసియేట్ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రంగనాథ్, రాజేష్‌బాబు, కార్యదర్శులుగా దిలీప్‌కుమార్, కౌసర్, మల్లప్ప, ట్రెజరర్‌గా రమేష్‌నాయక్‌ను ఎన్నుకున్నారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లికార్జునను ఎంపిక చేశారు.

పెనుకొండ: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పెనుకొండ తాలూకా యూనిట్ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవమయ్యాయి. సమావేశ భవనంలో ఎన్నికల అధికారి దేవేంద్ర, సహాయ ఎన్నికల అధికారి సూర్యనారాయణ, ఈశ్వర్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. నూతన అధ్యక్షులుగా మధుబాబు, సహాయధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శివప్రసాద్, మహ్మద్‌గౌస్, రాజమ్మబాయి, కార్యదర్శిగా గంగాధర్, సంయుక్త కార్యదర్శులు నరేష్, సుబ్రహ్మణ్యం, తలారి తేజ, వరలక్ష్మీ, కోశాధికారిగా బాబా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

పావగడ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీతత్వాన్ని పెంచుకోవాలని వీఎస్ విద్యాసంస్థ కార్యదర్శి అశ్వత్థనారాయణ సూచించారు. బుధవారం వీఎస్ విద్యాసంస్థల విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులు సాయి వెంకటేశ్, పుష్ప, తార, హజీర్, లహరి, ప్రజ్వల్‌ను ఆయనతోపాటు ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

పశు వ్యాధులపై అవగాహన

రొద్దం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పశువులకు సోకే గర్భకోశ వ్యాధులపై బుధవారం పెద్దగువ్వలపల్లి గ్రామంలో రాష్ట్రీయ గోకుల్‌మిషన్, ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకటేష్, టెక్నికల్ ఆఫీసర్ శ్రీకాంత్, రొద్దం వైద్యాధికారి జాహ్నవి, బ్రహ్మానందరెడ్డి, గ్రామ సచివాలయ పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు భోజరాజు, శిల్ప, శైలజ పాల్గొన్నారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గుంతలు లేని రహదారులను చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో కొత్తగా సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.11.31కోట్లు మంజూరైందన్నారు. అందులో హిందూపురం రోడ్డు నుంచి ఎల్లోటి గ్రామం వరకు రూ.1.77కోట్లు, కెఎస్ తండా నుంచి వయా నీలకంఠాపురం మీదుగా డీ గొల్లహట్టి వరకు రూ.1.69కోట్లు, మండలపల్లి నుంచి ముతుకూరు తండా రూ.2.07కోట్లు మంజూరైందన్నారు. ముత్తాపల్లి నుంచి లక్ష్మీపురం మీదుగా హనిసేకుంట వరకు రూ.1.79కోట్లు, పి.బ్యాడిగెరె నుంచి మధూడి రోడ్డు వయా కెంకెర రూ.1.49కోట్లు, దాసరిపల్లి నుంచి అమరాపురం వరకు రూ.2.15కోట్లు నిధులు మంజూరైనట్లు వివరించారు. గత ప్రభుత్వంలో రోడ్లన్నీ గుంతల మయంగా మారడంతో అనేక ప్రమాదాలకు కేంద్ర బిందువులా మారాయన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని గుంతలు లేని రహదారులుగా చూడాలనే లక్ష్యంతో అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు.

కార్యకర్త మృతికి నివాళి

అగళి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసేగౌడనహళ్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మల్లేశప్ప కుమారుడు శివకుమార్ బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆ గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన గుండుమల మాట్లాడుతూ పార్టీ అండగా ఉంటుందన్నారు.

న్యాయవాదుల నిరసన

వన్‌టౌన్ సీఐ అవహేళనగా మాట్లాడారంటూ

అంబేడ్కర్ సర్కిల్‌లో బైఠాయింపు



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హిందూపురం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): హిందూపురం వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు న్యాయవాదిపట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని బుధవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి రోడ్డుపై బైఠాయించారు. అంబేద్కర్ సర్కిల్‌లో సుమారు 2 గంటలపాటు నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అబ్దుల్లా అనే న్యాయవాది ఓ కేసు విషయమై మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారని, అప్పుడు సీఐ న్యాయవాదిపట్ల అవహేళనగా మాట్లాడారన్నారు. సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. ఈ సందర్భంలో వన్‌టౌన్ సీఐ న్యాయవాదులు నిరసన తెలుపుతున్న ప్రదేశానికి చేరుకుని వీడియో తీశారు. దీనిపై న్యాయవాదులు అసహనం వ్యక్తం చేశారు. డీఎస్పీ వచ్చేదాకా నిరసన విరమించేదిలేదని భీష్మించారు. డీఎస్పీ మహేష్ అక్కడకు చేరుకుని న్యాయవాదులతో మాట్లాడారు. న్యాయవాదిపట్ల అనుచితంగా వ్యవహరించి ఉంటే చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులను కోరతానని చెప్పడంతో న్యాయవాదులు నిరసన విరమింపజేశారు. రెండు గంటలపాటు అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలపడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తాం

- జీసీడీఓ అనిత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రికార్డులను పరిశీలిస్తున్న జీసీడీఓ

గుడిబండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరికెర గ్రామ సమీపంలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామని జీసీడీఓ అనిత పేర్కొన్నారు. అపరిశుభ్రత నడుమ కేజీబీవీ అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన జీసీడీఓ బుధవారం కేజీబీవీని సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు మరుగుదొడ్లు, స్నానపుగదులు తాగునీటి సౌకర్యం ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలన్నారు. పాఠశాల ఎస్ఓ రమాదేవి అందుబాటులో లేదని విచారించగా విషయం వెల్లడైంది. ఎస్ఓ అందుబాటులో ఉండి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడంతోపాటు మెరుగైన విద్యను అందించేందుకు కృషిచేయాలన్నారు. విధులకు హాజరుకాకపోతే చర్యలు తప్పవన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.

జూనియర్ కళాశాల విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తాం

గుడిబండ జూనియర్ కళాశాలలో చదువుతున్న బాలికల హాస్టల్ వసతి కల్పించనున్నట్లు జీసీడీఓ అనిత పేర్కొన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థినులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించి విద్యాభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: సీపీఎం

సోమందేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పత్తి, మొక్కజొన్న, అరటి తదితర పంట సాగుచేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రెడ్డిశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధర, రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించి ఆర్ఎస్‌కెల ఆధ్వర్యంలో పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజగోపాల్, అంజినమ్మ, శ్రీకాంత్, చంద్రశేఖర్, మల్లేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇన్ సర్వీస్ టీచర్లను మినహాయించాలి'

మడకశిరటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షులు భూతన్న అన్నారు. బుధవారం యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మహలింగప్ప, జిల్లా కార్యదర్శి నరసింహప్ప, నాయకులు జోగప్ప, మూడ్లగిరియప్ప పాల్గొన్నారు.

● **పెనుకొండ:** ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌నుంచి మినహాయింపు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. గురువారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, నారాయణస్వామి, రమేష్, నరసింహులు, ఉపేంద్ర, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.